# అల్జీమర్స్ వ్యాధితో జ్ఞాపకశక్తి క్షీణిస్తుందా !

**(21 సెప్టెంబర్ 'ప్రపంచ అల్జీమర్స్ దినం' సందర్భంగా)**

నాడీమండల సంబంధ రుగ్మత (న్యూరొలాజికల్ డిజార్డర్) మూలంగా మెదడు సంకోచం, మెదడు కణాలు నశించడంతో జ్ఞాపకశక్తిని కోల్పోవడం, ప్రవర్తనలో తేడాలు, ఆలోచనలో విపరీత ధోరిణిలు, సామాజిక నైపుణ్యాల్లో వ్యత్యాసాలతో స్వతంత్రంగా జీవనం గడపలేని ప్రమాదకర అల్జీమర్స్ (డెమెన్షియా) లేదా మెదడుకు క్షీణ దశ కలుగుట అనబడే రుగ్మత కలుగుతుంది. ప్రపంచవ్యాప్తంగా 50 మిలియన్ల ప్రజలు డెమెన్షియాతో బాధ పడుతున్నారని, ఇందులో 70 శాతం వరకు అల్జీమర్స్ రోగులు ఉండవచ్చని అంచనా వేశారు. ఒక్క అమెరికాలోనే 5.8 మిలియన్ల అల్జీమర్స్ వ్యాధిగ్రస్థులు ఉన్నారని, వీరిలో 80 శాతం 75 ఏండ్లు దాటిన వృద్ధులే ఉన్నారని తేలింది. 85 ఏండ్లు దాటిన వృద్ధుల్లో 33 శాతం మందికి అల్జీమర్స్ వ్యాధి కనిపిస్తుంది. సరైన శాశ్వత చికిత్స లేకపోయినా, వైద్యంతో కొంత ఆలస్యంగానైనా ఉపశమనం లభించి, తమ పనులను తామే చేసుకోవడానికి వెసులుబాటు కలుగుతుంది. అల్జీమర్స్ వ్యాధి ముదిరితే మెదడు కుచించుకొని పోవడం, డీహైడ్రేషన్, ఇన్‌ఫెక్షన్ కలిగి చివరకు మరణం కూడా జరుగవచ్చు.

## అల్జీమర్స్ వ్యాధి లక్షణాలు:

తాజా సంఘటనలు కూడా మరిచి పోవడం, జ్ఞాపకశక్తిని క్రమంగా కోల్పోవడం, విపరీత ప్రవర్తనలు, స్వతంత్రంగా పనులు చేసుకోలేకపోవడం, దినచర్యను మరిచి పోవడం, మాట్లాడడం/వ్రాయడంలో సమస్యలు, ఇంట్లో వస్తువుల్ని వెతకలేకపోవడం, మనుషుల్ని గుర్తించలేకపోవడం, నిర్ణయాలు తీసుకునే స్థితిని కోల్పోవడం, మానసిక అస్థిరత్వం, సమూహాలకు దూరంగా జరగడం, నిద్ర అలవాటు మారడం, చికాకు పడడం, ఆవేశ పడడం, మానసిక ఒత్తిడిలో ఉండడం, మెదడు క్రియాశీలత క్షీణించడం, మతి మరుపు ముదరడం లాంటివి అల్జీమర్స్ వ్యాధి లక్షణాలుగా పేర్కొనబడ్డాయి.

అతి ప్రమాదకర అల్జీమర్స్ వ్యాధి వయోవృద్ధుల్లో అధికంగా కలుగుతుంది. ట్రాఫిక్ రణగొణ ధ్వనుల వల్ల కూడా ఈ వ్యాధి కలుగవచ్చు. జ్ఞాపకశక్తి కోల్పోవడం, తీవ్ర చిత్త వైకల్యం, దిన చర్య నిర్వహణలో ఇతరుల సహాయం అవసరం కావడం లాంటి లక్షణాలు అల్జీమర్స్ వ్యాధికి లక్షణాలు అవుతాయి.

## అవగాహనతో ఉపశమనం:

ఇలాంటి ప్రమాదకర వ్యాధి పట్ల ప్రజల్లో అవగాహన, వ్యాధి లక్షణాలు, వైద్య సదుపాయాలు, వ్యాధిగ్రస్థుల పట్ల సహానుభూతి ప్రదర్శనలు లాంటి అంశాలను ప్రజలకు వివరించే ఉద్దేశంతో ప్రతి ఏట 21 సెప్టెంబర్‌న 'ప్రపంచ అల్జీమర్స్ దినం' పాటించుట ఆనవాయితీగా మారింది. మనిషి ఆరోగ్యంగా ఉన్నట్లు కనిపించినప్పటికీ మానసికంగా జ్ఞాపకశక్తిని కోల్పోవడం కనబడుతుంది. 'బ్లడ్-టు-బ్రెయిన్ పాత్‌వే' కారణంగా అల్జీమర్స్ వ్యాధి కలుగుతుందని ఇటీవల కనుగొన్నారు.

కొన్ని ప్రత్యేక పోషకాహార పదార్థాలు (కూరగాయలు, చిక్కుడు, చేపలు, ఆలివ్ ఆయిల్, హోల్ గ్రేయిన్స్ సాంటివి) తీసుకోవడం వల్ల మెదడు క్షీణత తగ్గుతూ, అల్జీమర్స్ వ్యాధి కొంత వరకు నిరోధించబడుతుంది. కోవిడ్-19 వ్యాధి అనంతరం అల్జీమర్స్ వ్యాధి పెరిగిందని కూడా తేలింది.

సాధారణ ప్రజానీకం అల్జీమర్స్ వ్యాధి పట్ల అవగాహన కలిగి, వ్యాధిగ్రస్థులను సహానుభూతితో చూసుకోవడం, రోగ లక్షణాలను/చికిత్స మార్గాలను తెలుసుకోవడం, రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవడం లాంటి జ్ఞానంతో డెమెన్షియాను దూరం చేద్దాం, వృద్ధులను పూలలో పెట్టి చూసుకుందాం.

– డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# ఎంఎన్ఐటీ, జైపూర్ 18వ స్నాతకోత్సవంలో రాష్ట్రపతి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20 : రాజస్థాన్ లోని జైపూర్ లో ఈరోజు జరిగిన మాలవీయ నేషనల్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఎన్ ఐటీ) 18వ స్నాతకోత్సవంలో భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రాష్ట్రపతి మాటాడుతూ దేశంలో నాణ్యమైన సాంకేతిక విద్య, పరిశోధనలను ప్రోత్సహించేందుకు ఎన్ఐటీలను ఏర్పాటు చేశామన్నారు. నైపుణ్యం, సమర్థత కలిగిన మానవ వనరులను అందించడంలో ఇవి ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి.

ఎన్ఐటీల ప్రాముఖ్యత దృష్ట్యా వాటికి జాతీయ ప్రాముఖ్యత కలిగిన సంస్థలుగా హోదా కల్పించారు.

ఎన్ఐటీల్లో సగం మంది విద్యార్థులు సొంత రాష్ట్రం నుంచి వస్తున్నారని, మిగతా సగం మంది జాతీయ ర్యాంకింగ్ ఆధారంగా ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్నారని రాష్ట్రపతి తెలిపారు. ఈ విధంగా, ఈ వ్యవస్థ ఒక వైపు, స్థానిక ప్రతిభావంతుల వికాసానికి వీలుకల్పిస్తూనే, మరోవైపు, భిన్నత్వంలో ఏకత్వం స్ఫూర్తిని బలోపేతం చేయడానికి కూడా దోహద పడుతుందని అన్నారు. దేశాన్ని పరిశోధన, ఆవిష్కరణల కేంద్రంగా మార్చడంలో ఎన్ఐటీ వంటి సాంకేతిక సంస్థలు కీలకపాత్ర పోషిస్తున్నాయని రాష్ట్రపతి అన్నారు. ఎంఎన్ఐటీలో ఏర్పాటు చేసిన 'ఇన్నోవేషన్ అండ్ ఇంక్యుబేషన్ సెంటర్' ఇప్పటివరకు అనేక అంకుర సంస్థల ఏర్పాటు కార్యక్రమాలను నిర్వహించిందని, తద్వారా పెద్ద సంఖ్యలో పాల్గొన్నవారికి ప్రయోజనం చేకూరిందని ఆమె సంతోషం వ్యక్తం చేశారు. ఎంఎన్ఐటీ ఇంక్యుబేషన్ సెంటర్లో సుమారు 125 అంకుర సంస్థలు నమోదు అయ్యాయని, ఇవికొత్త ఉపాధి అవకాశాలను కూడా సృష్టిస్తున్నాయని ఆమె తెలిపారు.

ప్రస్తుత నాలుగో పారిశ్రామిక విప్లవ యుగంలో, సవాళ్లతో పాటు కొత్త అవకాశాలు కూడా వస్తున్నాయని రాష్ట్రపతి అన్నారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని, సాంకేతిక రంగంలో భారత్ ను అగ్రగామి దేశంగా తీర్చిదిద్దడంలో మన సాంకేతిక సంస్థల పాత్ర చాలా కీలకమైనది. ఎంఎన్ఐటీలో కృత్రిమ మేధ, డేటా ఇంజనీరింగ్ విభాగాన్ని ఏర్పాటు చేయడం, ఈ కాలపు డిమాండ్లను స్వీకరించేలా రూపుదిద్దుకోవాలన్న సంస్థ నిబద్ధతను ప్రతిబింబిస్తుందని ఆమె పేర్కొన్నారు.

ఎన్ఐఆర్ఎఫ్ రూపొందించిన ఇండియా ర్యాంకింగ్స్ 2024లో, ఇంజినీరింగ్ కేటగిరీలో దేశంలోని టాప్ 50 విద్యాసంస్థలలో ఎంఎన్ఐటీ స్థానం దక్కించుకోవడం పట్ల రాష్ట్రపతి హర్షం వ్యక్తం చేశారు. ఎంఎన్ఐటీ అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది మరింత శ్రమపడి ఎంఎన్ఐటీని దేశంలోని టాప్ 10 సంస్థలలోకి తీసుకువస్తారని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. దేశ సామాజిక, ఆర్థికాభివృద్ధికి మాత్రమే కాకుండా మన ఆడబిడ్డల జీవన ప్రమాణాలు మెరుగుపడటానికి కూడా పరిశోధన, అభివృద్ధి రంగంలో మహిళల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని రాష్ట్రపతి అన్నారు. ఇటీవలి కాలంలో స్టెమ్- సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మాథ్స్, మెడిసిన్ లో బాలికల నమోదు పెరిగిందని ఆమె పేర్కొన్నారు. పట్టా స్వీకరిస్తున్న మొత్తం విద్యార్థుల్లో బాలికలు సుమారు 29 శాతం మాత్రమే ఉన్నప్పటికీ, ఈ స్నాతకోత్స వంలో 20 బంగారు పతకాలకుగాను 12 బంగారు పతకాలు మహిళా విద్యార్థులే సాధించారని ఆమె సంతోషం వ్యక్తం చేశారు. పతకాలు సాధించిన వారిలో బాలికల నిష్పత్తిని గమనిస్తే, అమ్మాయిలకు సమానావ కాశాలు లభిస్తే వారు మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించగలరనడానికి నిదర్శనమని ఆమె అన్నారు. విద్యార్థులు ఇప్పుడు తమ జీవితంలో కొత్త దశలోకి ప్రవేశిస్తున్నారని రాష్ట్రపతి అన్నారు. వారు కొత్త సవాళ్లు, అవకాశాలను ఎదుర్కొంటారు. ఎంఎన్ఐటీలో సంపాదించిన పరిజ్ఞానం, నైపుణ్యాలతో విద్యార్థులు ఆ సవాళ్లను ఎదుర్కొని, అందివచ్చే అవకాశాలను సద్వినియోగం చేసుకోగలుగుతారని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు.

## ప్రధాన్ మంత్రి అన్నదాత ఆయ్ సంరక్షణ్ అభియాన్ (పీఎం-ఆషా) పథకాల కొనసాగింపునకు కేంద్ర మంత్రిమండలి ఆమోదం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20 : ఒకవైపు రైతులకు గిట్టుబాటు ధరల్ని అందిస్తూ, మరోవైపు ప్రజలపై నిత్యావసర సరకుల ధరాభారం పడకుండా- ప్రధానమంత్రి అన్నదాతా ఆదాయ సంరక్షణ పథకం (ప్రధాన మంత్రి అన్నదాత ఆయ్ సంరక్షణ్ అభియాన్- పీఎం-ఆషా) పథకాలను కొనసాగించడానికి ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

15వ ఆర్థిక సంఘం చివరి నాటికి (2025-26 ఆర్థిక సంవత్సరం) పథకం మొత్తం అంచనా వ్యయం రూ.35,000 కోట్లు కానుంది.

రైతులకు, వినియోగదారులకు సమర్థవంతమైన సేవలందించడానికి ప్రభుత్వం ధరల ఆదరణ/మద్దతు పథకాన్ని (పిఎస్ఎస్), ధరల స్థిరీకరణ నిధి (పిఎస్ఎఫ్) పథకాలను పీఎం ఆశాలో కలిపింది. పీఎం-ఆషా సంయుక్త పథకం అమలు ద్వారా సేవలు మరింత చేరువై, సానుకూల ప్రభావాన్ని చూపనున్నాయి. ఇది రైతుల ఉత్పత్తులకు గిట్టుబాటు ధరను అందించడంలో సహాయపడటమే కాకుండా వినియోగదారులకు సరసమైన ధరలకు నిత్యావసర వస్తువుల లభ్యమయ్యేలా చూస్తుంది. పీఎం-ఆషా పథకంలో ప్రస్తుతం ధరల ఆదరణ/మద్దతు పథకం (పిఎస్ఎస్), ధరల స్థిరీకరణ నిధి (పిఎస్ఎఫ్), ధర లోటు చెల్లింపు పథకం (పిఒపిఎస్), మార్కెట్ మధ్యవర్తిత్వ పథకం(ఎంఐఎస్) మిళితమై ఉంటాయి.

ధరల మద్దతు పథకం కింద పేర్కొన్న పప్పుధాన్యాలు, నూనెగింజలు, కొబ్బరిని కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తారు. ఇది 2024-25 పంటకాలంలో జాతీయ ఉత్పత్తిలో 25 శాతంగా ఉండనుంది. రైతులకు గిట్టుబాటు ధరలను కల్పించేందుకు, సంక్షోభ కాలంలో వారి నష్టాల నివారించేందుకు కనీస మద్దతు ధరకు పంటలను కొనుగోలుకు చేసేందుకు రాష్ట్రాలకు వీలు కల్పిస్తుంది. అయితే, కందిపప్పు, పెసర, మైసూర్ పప్పు విషయంలో 2024-25 పంట కాలంలో ఈ పరిమితి వర్తించదు. ఎందుకంటే ముందుగా నిర్ణయించిన విధంగా 2024-25 పంటకాలంలో కందిపప్పు, పెసర, మైసూర్ పప్పుల వంద శాతం సేకరణ ఉండనుంది.

రైతుల నుంచి కనీస మద్దతు ధరకు పప్పుధాన్యాలు, నూనెగింజలు, కొబ్బరి కొనుగోలుకు ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ గ్యారంటీని రూ.45 వేల కోట్లకు పెంచారు. వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ, కనీస మద్దతు ధరకు పప్పుధాన్యాలు, నూనెగింజలు, కొబ్బరి మరింత కొనుగోలు చేసేందుకు ఈ నిర్ణయం తోడ్పడుతుంది. కనీస మద్దతు ధర కన్నా మార్కెట్ రేటు పడిపోయినప్పుడు కొనుగోలు... వ్యవసాయ శాఖ మాత్రమే కాకుండా నాఫెడ్ కు చెందిన ఇ-సమృద్ధి పోర్టల్‌లో నమోదిత రైతులు, నేషనల్ కోపరేటివ్ కన్స్యూమర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకు చెందిన ఇ-సంయుక్తి పోర్టల్ ఎంఎస్పీ ధరకే కొనుగోలు చేపడతాయి. దీని ద్వారా దేశంలో రైతులు ఈ పంటలను ఎక్కువగా పండించడానికి ప్రోత్సహం లభిస్తుంది. అంతే కాకుండా ఈ పంటలలో స్వయం సమృద్ధిని సాధించడానికి దోహదపడుతుంది.

# తిరుపతి లడ్డూ తయారీపై సమగ్ర నివేదిక ఇవ్వండి

**-ఈ వివాదంపై చంద్రబాబు సమీక్ష**
**-తిరుమల పవిత్రతను కాపాడుతాం**
**-ఈ కుంభకోణంలో పెద్దలున్నా జైలుకే**
**- టిటిడి ఈవోకి చంద్రబాబు ఆదేశం**

అమరావతి, సెప్టెంబర్ 20 : లడ్డూ తయారీలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పిదాలపై ఈ రోజు సాయంత్రంలోగా సమగ్ర నివేదిక ఇవ్వాలని టిటిడి ఈవోను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. శ్రీవారి లడ్డూ తయారీలో అపవిత్ర పదార్థాలు



వినియోగించిన అంశంపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్ గా ఉంది. అత్యంత పవిత్రమైన తిరుమలలో జరిగిన ఈ అపచారంపై ప్రపంచ వ్యాప్తంగా వెల్లువెత్తుతున్న ఆందోళనలు, భక్తుల ఆవేదనల నేపథ్యంలో . గత ప్రభుత్వ హయాంలో తిరుమల లడ్డూ తయారీలో నాణ్యతా లోపాలు, అపవిత్ర పదార్థాల వాడకంపై చంద్రబాబు సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.

ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్, మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, నిమ్మల రామానాయుడు, అనగాని సత్యప్రసాద్, కొల్లు రవీంద్ర, కొలుసు పార్థ సారథితో పాటు ఉన్నతాధికారులతో తిరుమల అంశంపై సీఎం సమీక్షించారు.

తిరుమల పవిత్రత కాపాడే విషయంలో ఆగమ, వైదిక, ధార్మిక పరిషత్లతో చర్చించి చర్యలు తీసుకుంటామని సీఎం ప్రకటించారు. భక్తుల విశ్వాసాలు, ఆలయ సాంప్రదాయాలను కాపాడతామని చంద్రబాబు అన్నారు. ఈ తిరుమల పవిత్ర ను కాపాడే విషయంలో రాజీ పడబోమని తేల్చ చెప్పారు.. ఈ కుంభకోణంలో ఎంతటి పెద్దలున్నా వదిలి పెట్టే సమస్య లేదని చంద్రబాబు తేల్చి చెప్పారు..

చంద్రబాబుతో కేంద్రమంత్రి నడ్డా..

తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగంపై కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా ఆరా తీశారు. ఏపీ సీఎం చంద్రబాబుతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. దీనికి సంబంధించిన నివేదిక ఇవ్వాలని కోరారు.

జగన్ పై కేంద్ర మంత్రులు గరం గరం

తిరుమల శ్రీవారి మహాప్రసాదం లడ్డూ వివాదం వేళ కార్మిక శాఖ సహాయ మంత్రి శోభాకరంద్లాజే ఈ అంశంపై తీవ్రంగా స్పందించారు. "తిరుమలకు చెందిన కళాశాలల్లో పద్మావతీ శ్రీనివాసుల ఫొటోలను తొలగించాలని, హిందుయేతర గుర్తులను సప్తగిరులపై ఏర్పాటు చేయాలని జగన్ అండ్ కో చూసింది. హిందువులు కానివారిని బోర్డ్ ఛైర్మన్‌గా నియమించింది. జంతువుల కొవ్వులను పవిత్ర ప్రసాదంలో కలిపింది. వెంకటేశ్వరస్వామీ.. మా చుట్టూ జరుగుతున్న ఈ హిందూ వ్యతిరేక రాజకీయాలకు మమ్మల్ని క్షమించు" అని ఘాటుగా ఎక్స్‌లో పోస్టు చేశారు.

సమగ్ర దర్యాప్తు జరపండి - ప్రహ్లాద్ జోషి

లడ్డూలో కల్తీ ఆరోపణలపై దర్యాప్తు అవసరమని కేంద్ర ఆహారశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. "ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పిన అంశం చాలా తీవ్రమైంది. దీనిపై సమగ్రంగా విచారణ జరిపి.. దోషులుగా తేలిన వారిని శిక్షించాలి" అని ఆయన వ్యాఖ్యానించారు.

# బయో టెక్నాలజీలో అత్యాధునిక పరిశోధన, అభివృద్ధికి తోడ్పడేందుకు 'బయో-రైడ్' పథకం: ఆమోదం తెలిపిన మంత్రి మండలి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20 : డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ (డీబీటీ)కి సంబంధించిన ఒకే గొడుగు కింద ఉన్న రెండు పథకాలను విలీనం చేయాలని కేంద్ర మంత్రిమండలి నిర్ణయించింది. ఈ రోజు ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రి మండలిలో ఈ నిర్ణయం తీసుకున్నారు. 'బయోటెక్నాలజీ రీసెర్చ్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ (బయో-రైడ్)' అనే ఒక కొత్త పథకం పేరుతో పాత విధానాలను విలీనం చేశారు. బయోమాన్యుఫ్యాక్చరింగ్, బయోఫౌండ్రీ పేరుతో రెండు కొత్త అంశాలను ఇందులో చేర్చారు.

బయో-రైడ్ పథకం- ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి, బయోటెక్నాలజీ రంగంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను తయారుచేయడానికీ, బయోమాన్యుఫ్యాక్చరింగ్, బయోటెక్నాలజీలో ప్రపంచానికి ఓ కరదీపికగా భారతదేశం స్థానాన్ని బలోపేతం చేయడానికి రూపొందించారు. ఇది పరిశోధనను వేగవంతం చేయడం, ఉత్పత్తి అభివృద్ధిని మెరుగుపరచడం, విద్యా పరిశోధన, పారిశ్రామిక రంగాల మధ్య అంతరాన్ని తగ్గించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, పర్యావరణ సుస్థిరత, స్వచ్ఛమైన ఇంధనం వంటి జాతీయ, ప్రపంచ సవాళ్లను పరిష్కరించడానికి బయో-ఇన్నోవేషన్ సామర్థ్యాన్ని ఉపయోగించుకునే కేంద్ర ప్రభుత్వ మిషన్‌లో ఈ పథకం ఓ భాగం.

బయో-రైడ్ ని ప్రోత్సహించడం వల్ల జరిగేది-

బయోటెక్నాలజీలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను తయారు చేయడం: ఔత్సాహికులకు ప్రారంభ పెట్టుబడులు (సీడ్ ఫండ్) అందించడం, పెట్టుబడులు, నిలదొక్కుకునే వరకూ సాయం అందించడం, సీనియర్ల ద్వారా మార్గదర్శనం అందించడం ద్వారా అంకుర సంస్థల కోసం అభివృద్ధి చెందుతున్న విస్తారణ వ్యవస్థను బయో-రైడ్ పెంపొందిస్తుంది.

అడ్వాన్స్ ఇన్నోవేషన్: సింథటిక్ బయాలజీ, బయోఫార్మాస్యూటికల్స్, బయోఎనర్జీ, బయోప్లాస్టిక్స్ వంటి రంగాల్లో అత్యాధునిక పరిశోధన, అభివృద్ధికి ఈ పథకం నిధులనూ, ప్రోత్సాహకాలనూ అందిస్తుంది.

పరిశ్రమ- విద్యా సంస్థల సహకారాన్ని సులభతరం చేయడం: బయో-ఆధారిత ఉత్పత్తులు, సాంకేతికతల వాణిజ్యీకరణను వేగవంతం చేయడానికి విద్యా సంస్థలు, పరిశోధన సంస్థలు, పరిశ్రమల మధ్య సమన్వయం దిశగా బయో-రైడ్ ఉపకరిస్తుంది.

సుస్థిరమైన బయో మ్యాన్యుఫ్యాక్చరింగ్‌కు ప్రోత్సాహం: భారత దేశం హరిత లక్ష్యాలకు అనుగుణంగా బయోమాన్యుఫ్యాక్చరింగ్‌లో పర్యావరణపరంగా స్థిరమైన పద్ధతులను ప్రోత్సహించడంపై అధిక దృష్టి పెడుతుంది.

### అదనపు నిధుల ద్వారా పరిశోధకు లకు మద్దతు:

వ్యవసాయం, ఆరోగ్య సంరక్షణ, బయోఎనర్జీ, పర్యావరణ స్థిరత్వం వంటి రంగాలలో పరిశోధనా సంస్థలు, విశ్వవిద్యాలయాలు, వ్యక్తిగత పరిశోధకులకు అదనపు నిధులను అందిస్తుంది. దీని ద్వారా బయోటెక్నాలజీలోని విభిన్న రంగాలలో శాస్త్రీయ పరిశోధన, ఆవిష్కరణలు, సాంకేతిక అభివృద్ధిని అభివృద్ధి చేయడంలో బయో-రైడ్ కీలక పాత్ర పోషిస్తుంది.

### బయోటెక్నాలజీ రంగంలో మానవ వనరులను పెంపొందించడం:

బయోటెక్నాలజీ బహుళ విభాగాలలో పనిచేస్తున్న విద్యార్థులు, యువ పరిశోధకులు, శాస్త్రవేత్తలకు బయో-రైడ్ సమగ్ర అభివృద్ధి, మద్దతును అందిస్తుంది. మానవ వనరుల అభివృద్ధి సమీకృత కార్యక్రమం మానవశక్తి సామర్థ్యాన్ని పెంపొందించడానికి, నైపుణ్యాన్ని పెంపొందించడానికి దోహదపడుతుంది. కొత్త పుంతలు తొక్కే సాంకేతిక పురోగతిని ప్రభావితం చేయడానికి ఈ కార్యక్రమం సహాయపడుతుంది.

ఇంకా, దేశంలో చక్రభ్రమణ (సర్క్యులర్ బయోఎకానమీ) ని పెంపొందించడానికి బయో మాన్యుఫ్యాక్చరింగ్, బయోఫౌండ్రీలో ఒక భాగం ప్రారంభం అవుతుంది. ఇది గౌరవ ప్రధానమంత్రి ప్రారంభించిన పచ్చని, స్నేహపూర్వక వాతావరణ మార్పులను తగ్గించే 'లైఫ్‌స్టైల్ ఫర్ ది ఎన్విరాన్‌మెంట్ (లైఫ్)' ద్వారా జీవితంలోని ప్రతి అంశంలో పర్యావరణ పరిష్కారాలు చూపుతుంది. బయో-రైడ్ ఆరోగ్య సంరక్షణ ఫలితాలను మెరుగుపరచడానికి, వ్యవసాయ ఉత్పాదకతను పెంపొందించడానికీ, బయోటెక్నాలజీ ఆధారిత వృద్ధిని పెంపొందించడానికి ప్రయత్నిస్తోంది. అలాగే స్వదేశీ వినూత్న పరిష్కారాల అభివృద్ధిని సులభతరం చేయడానికి 'బయోమ్యాన్యుఫ్యాక్చరింగ్' అపారమైన సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని ఆకాంక్షిస్తోంది.

కొనసాగుతున్న డీబీటీ ప్రయత్నాలు జాతీయ అభివృద్ధి, సమాజ శ్రేయస్సు కోసం ఒక ఖచ్చితమైన సాధనంగా బయోటెక్నాలజీ సామర్థ్యాన్ని ఉపయోగించుకోవాలనే దృష్టికి అనుగుణంగా ఇవన్నీ ఉంటాయి. బయోటెక్నాలజీ పరిశోధన, ఆవిష్కరణ, మార్పు, పారిశ్రామిక వృద్ధిలో భారతదేశాన్ని ప్రపంచవ్యాప్తంగా పోటీపడేలా చేస్తోంది. 2030 నాటికి 300 బిలియన్ డాలర్ల బయోటెక్నాలజీ ఆధారిత ఆర్థికాభివృద్ధిగా మారడం అనే లక్ష్యాన్ని నెరవేర్చడానికి కృషి చేస్తుంది. బయో-రైడ్ పథకం 'వికసిత భారత్ 2047' విజన్‌ను సాకారం చేయడంలో గణనీయంగా దోహదపడుతుంది.

శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వ శాఖ పరిధిలోని బయోటెక్నాలజీ డిపార్ట్‌మెంటు (డీబీటీ), బయోటెక్నాలజీ, ఆధునిక జీవశాస్త్రంలో నైపుణ్యం, ఆవిష్కరణ-ఆధారిత పరిశోధన, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహిస్తుంది.




# నయాబజార్ కాలేజీ ఆవరణ విద్యార్థుల అధ్వర్యంలో విద్యార్థి యుద్ధభేరి పోస్టర్ ఆవిష్కరణ

**- టీఎస్ఎస్ఏ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దామళ్ల సత్యం**
**- రాష్ట్రానికి సంక్షేమశాఖ మంత్రిని వెంటనే నియమించాలి**
**- సంక్షేమ వసతి గృహాలపై ప్రభుత్వానికి పట్టింపు లేదు**
**- వరంగల్ యుద్ధభేరీని విజయవంతం చేయండి**

ఖమ్మం, సెప్టెంబర్ 20 : (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నవంబర్ 22న హన్మకొండలో తలపెట్టిన విద్యార్థి



యుద్ధభేరి పోస్టర్ ను రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దామళ్ళ సత్యనారాయణ ఖమ్మం జిల్లా నయాబజార్ కాలేజీ ఆవరణలో విద్యార్థుల సమక్షంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఎస్సీ,ఎస్టి, బిసి,మైనార్టీ సంక్షేమ, గురుకుల హాస్టల్లో మెస్ చార్జీలు మూడింతలు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్టూడెంట్ పే కమిషన్ ఏర్పాటు చేయడం టిఎస్ఎస్ఏ పోరాట ఫలితమే అని అన్నారు. సంక్షేమ హాస్టల్ లోని పెండింగ్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నవంబర్లో జరిగే విద్యార్థి యుద్ధభేరి మహాసభను విద్యార్థులు, నిరుద్యోగులు పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (ఎన్ సీఓఈ) ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20 : యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్, ఎక్స్‌టెండెడ్ రియాలిటీ (ఏవీజీసీ-ఎక్స్ఆర్) కోసం నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (ఎన్ సీఓఈ) ఆవిర్భవిస్తోంది. కంపెనీల చట్టం 2013 ప్రకారం సెక్షన్ 8 కంపెనీగా దీనిని రూపొందిస్తున్నారు. ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన ఈ రోజు జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశం ఈ ప్రతిపాదనను ఆమోదించింది. ఇండియన్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ సమాఖ్య, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీలో ఉన్న పరిశ్రమల భాగస్వామ్యంతో ఈ సంస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ముంబయిలో ఎన్ సీఓఈ సంస్థను ఏర్పాటు చేస్తున్నారు. దేశంలో ఏవీజీసీ టాస్క్ ఫోర్స్ ఏర్పాటు కోసం కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల మంత్రి 2022-23 బడ్జెట్ ప్రకటనకు అనుగుణంగా ఇది ప్రారంభం అవుతోంది.

ఫిల్మ్ మేకింగ్, ఓవర్ ది టాప్ (ఓటీటీ), గేమింగ్, వాణిజ్య ప్రకటనలు, ఆరోగ్యం, విద్య, ఇతర సామాజిక రంగాలతో సహా మొత్తం మీడియా, వినోద రంగంలో ఏవీజీసీ-ఎక్స్ఆర్ రంగం నేడు ఒక అనివార్యమైన పాత్రను పోషిస్తుంది. దేశం అభివృద్ధి గమనంలో వెళుతున్నది. వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతికత, దేశవ్యాప్తంగా పెరుగుతున్న ఇంటర్నెట్, చౌక డేటా రేట్లతో పోటీ పడుతూ, ప్రపంచవ్యాప్తంగా ఏవీజీసీ-ఎక్స్ఆర్ వినియోగం విపరీతమైన వేగంతో పెరగడానికి సిద్ధంగా ఉంది.

### ఏవీజీసీ-ఎక్స్ఆర్ రంగం వృద్ధి దిశగా పయనం

చురుకుగా సాగుతున్న ఈ వేగాన్ని కొనసాగించడానికి, దేశంలో ఏవీజీసీ-ఎక్స్ఆర్ విస్తరణ వ్యవస్థను ప్రోత్సహించడానికి, ఒక అత్యున్నత సంస్థగా నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ను స్థాపిస్తున్నారు. అత్యాధునిక ఏవీజీసీ-ఎక్స్ఆర్ టెక్నాలజీల్లో సరికొత్త నైపుణ్యాలతో ఔత్సాహికులు, నిపుణులను సన్నద్ధం చేయడానికి ప్రత్యేక శిక్షణ, బోధనా కార్యక్రమాలను అందిస్తుంది. పరిశోధన, అభివృద్ధిని ప్రోత్సహిస్తుంది. కంప్యూటర్ సైన్స్ వంటి వివిధ రంగాలకు చెందిన నిపుణులను ఒకచోట చేరుస్తుంది. ఇంజినీరింగ్, డిజైన్, ఆర్ట్... ఏవీజీసీ-ఎక్స్ఆర్ రంగంలో ప్రధాన పురోగతికి మార్గం వేస్తుంది. దేశవిదేశాల మార్కెట్ల కోసం భారతదేశం ఐపీని రూపొందించడంపై నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్- విస్తృతంగా దృష్టి సారిస్తుంది. మొత్తంగా ఇది భారతదేశ గొప్ప చారిత్రక, సాంస్కృతిక వారసత్వం ఆధారంగా కంటెంట్‌ను రూపొందించడానికి దారితీస్తుంది. ఇంకా, ఏవీజీసీ-ఎక్స్ఆర్ రంగంలో అంకుర సంస్థలు, ప్రారంభ-దశ కంపెనీలకు వనరులను అందించడం ద్వారా ఎన్ సీఓఈ ఒక ఇంక్యుబేషన్ సెంటర్‌గా పని చేస్తుంది. అలాగే, ఎన్ సీఓఈ విద్యారంగంతోపాటు, పరిశ్రమ రంగ అవసరాల కోసం కూడా పని చేస్తుంది.

ఈ ఎన్ సీఓఈ ని ఏవీజీసీ-ఎక్స్ఆర్ పరిశ్రమ వృద్ధికి చోదక శక్తిగా పని చేయడం ద్వారా దేశంలోని అన్ని ప్రాంతాల యువతకు ఇది అతిపెద్ద ఉపాధి వనరులలో ఒకటిగా ఉపయోగపడుతుంది. ఇది సృజనాత్మక కళలు, డిజైన్ రంగానికి అపారమైన ప్రోత్సాహాన్ని ఇస్తుంది. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాలను మరింతగా పెంచే ఏవీజీసీ-ఎక్స్ఆర్ కార్యకలాపాలకు భారతదేశాన్ని కేంద్రంగా మారుస్తుంది.

ఏవీజీసీ-ఎక్స్ఆర్ కోసం ఎన్ సీఓఈ అత్యాధునిక కంటెంట్‌ను అందించడానికి భారతదేశాన్ని కంటెంట్ హబ్‌గా ఉంచుతుంది. తద్వారా ప్రపంచవ్యాప్తంగా కళ పరంగా భారతదేశపు ప్రాభవాన్ని పెంచుతుంది. వీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలోకి విదేశీ పెట్టుబడులను ఆకర్షిస్తుంది.

# శ్రీవారి లడ్డూ ప్రసాదం- బాధ్యులపై కఠిన చర్యలు - పవన్ హామీ..

అమరావతి, సెప్టెంబర్ 20 : తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం వివాదంలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్. ఈ మేరకు ఆయన నేడు . 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఓ సంస్థ ఫిర్యాదు చేస్తూ పెట్టిన పోస్టుకు ఆయన సమాధానం ఇచ్చారు. ఈ అంశంపై తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నట్లు పేర్కొన్న పవన్ వైసీపీ హయాంలో పనిచేసిన టీటీడీ బోర్డు ఎన్నో ప్రశ్నలకు సమాధానం చెప్పాలని అన్నారు. తిరుమల లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలపడం బాధాకరమని అన్నారు. ఇది అందరి మనోభావాలనూ దెబ్బతీసిందన్నారు. బాధ్యులపై సాధ్యమైనంత కఠిన చర్యలు తీసుకోవడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పవన్ తెలిపారు.

### సనాతన ధర్మ రక్షణ బోర్డు ఏర్పడాలి...

అలాగే దేశంలోని దేవాలయాలకు సంబంధించిన అన్ని సమస్యలను పరిశీలించేలా జాతీయ స్థాయిలో 'సనాతన ధర్మ రక్షణ బోర్డు'ని ఏర్పాటు చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. జాతీయ స్థాయిలో విధాన నిర్ణేతలు, మత పెద్దలు, న్యాయవ్యవస్థ, పౌరులు, మీడియా, వారి సంబంధిత డొమైన్ లందరిచే ఈ విషయంపై చర్చ జరగాలి. సనాతన ధర్మాన్ని ఏ రూపంలోనైనా అపవిత్రం చేయకుండా ఉండేలా అందరూ కలిసిరావాలని పిలుపునిచ్చారు.

# అక్రమంగా ఖనిజం తరలిస్తున్న వాహనాల పట్టివేత



కర్నూలు, సెప్టెంబర్ 20: డోన్ కేంద్రంగా అక్రమంగా ఖనిజం తరలిస్తున్న రెండు లారీలపై శుక్రవారం కర్నూలు జిల్లా భూగర్భ ఖనిజం వనరుల మైనింగ్ శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. డోన్ నుంచి డోలమైట్ పౌడర్ ను రెండు వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్నట్లు భూగర్భ ఖనిజ వనరుల శాఖ అధికారులకు గుర్తుతెలియని వ్యక్తి సమాచారం అందించారు.

సమాచారం మేరకు డోన్ సమయంలో వెళ్తున్న రెండు లారీలను ఆపి తనిఖీలు చేయగా, అందులో డోలమేడ్ పౌడర్ ను ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్నట్లు మైనింగ్ శాఖ అధికారులు గుర్తించారు.

దీంతో రెండు లారీలను పోలీస్ స్టేషన్ కు తరలించారు. అనంతరం మైనింగ్ శాఖ నిబంధన మెరుగు ఒక్కొక్క లారీ యజమానికి రూపాయలు యాభై వేలు చొప్పున అపరాధ రుసుం విధించినట్లు భూగర్భ ఖనిజం శాఖ డిడి రాజశేఖర్ వెల్లడించారు. ఈ దాడుల్లో మైనింగ్ శాఖ విజిలెన్స్ విభాగం చెందిన బాలు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# హరియాణలో ప్రభుత్వ ఏర్పాటులో ఆప్ కీలక పాత్ర : అరవింద్ కేజ్రీవాల్



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20 : హరియాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) మెరుగైన ఫలితాలు సాధిస్తుందని ఢిల్లీ సీఎం, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ విశ్వాసం వ్యక్తం చేశారు. బీజేపీ ప్రజలకు చేసిందేమీ లేదని అన్నారు. కాషాయ పాలకులు అవినీతి, నిరుద్యోగం, ద్రవ్యోల్బణాన్ని ప్రజలకు అందించడం మినహా ప్రజల మేలు కోసం చేసిందేమీ లేదని దుయ్యబట్టారు. ఈసారి హరియాణ ప్రజలు మార్పు కోరుతున్నారని చెప్పారు. కేజ్రీవాల్ శుక్రవారం యమునానగర్‌లో జరిగిన ప్రచార ర్యాలీలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. హరియాణలో ఏ ప్రభుత్వం కొలువు తీరినా ఆప్ మద్దతుతోనే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ఆప్ పలు స్థానాలను చేజిక్కించుకుంటుందని, తమ పార్టీ తోడ్పాటు లేకుండా ప్రభుత్వ ఏర్పాటు సాధ్యం కాని పరిస్థితి నెలకొంటుందని కేజ్రీవాల్ ధీమా వ్యక్తం చేశారు. జగధ్రిలో పార్టీ అభ్యర్థి ఆదర్శ్‌పాల్ గుజ్జర్‌కు మద్దతుగా ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాగా, హరియాణ అసెంబ్లీ ఎన్నికలకు బీజేపీ వెల్లడించిన ఎన్నికల మ్యానిఫెస్టో కాంగ్రెస్ మ్యానిఫెస్టోకు కాపీ పేస్ట్‌లా ఉందని హరియాణ మాజీ సీఎం, విపక్ష నేత భూపీందర్ సింగ్ హుడా అంతకుముందు ఎద్దేవా చేశారు. క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి కాంగ్రెస్ పార్టీకి అనూహ్య మద్దతు లభిస్తోందని అన్నారు. పాలక బీజేపీ అన్ని రంగాల్లో విఫలమైందని ఆరోపించారు. రాష్ట్ర ప్రజలు మార్పు కోరుతున్నారని, కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. హరియాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి భంగపాటు తప్పదని కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని హరియాణ మాజీ సీఎం భూపీందర్ సింగ్ హుడా ధీమా వ్యక్తం చేశారు. హరియాణ ప్రజలు కాషాయ సర్కార్‌ను సాగనంపి కాంగ్రెస్ సర్కార్‌కు పట్టం కట్టనున్నారని విశ్వాసం వ్యక్తం చేశారు.

# బీఆర్ఎస్ అధ్యక్షులు కేసీఆర్‌ని కలిసిన ఎంపీ వద్దిరాజు,మాజీ ఎమ్మెల్యే సండ్ర



ఖమ్మం, సెప్టెంబర్ 20 : (నేటినిజం ప్రతినిధి): మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య తన పెద్ద కుమారుడు భార్గవ్ వివాహానికి హాజరు కావలసిందిగా కోరుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి,బీఆర్ఎస్ అధ్యక్షులు కల్వకుంట్ల చంద్రశేఖర రావును ఆహ్వానించారు.

సండ్ర బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్రతో కలిసి శుక్రవారం సాయంత్రం ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో కేసీఆర్ ని కలిసి వివాహ మహోత్సవ ఆహ్వాన శుభపత్రికను అందజేశారు. సండ్ర కుమారుడు భార్గవ్ పెళ్లి చిద్విత సాయితో అక్టోబర్ 13వతేదీ ఆదివారం రాత్రి హైదరాబాద్ శ్రీనగర్ కాలనీలోని శ్రీవేంకటేశ్వర స్వామి కళ్యాణ మండపంలో జరుగుతుంది.






# సంపూర్ణ స్వచ్ఛత, ప్రభుత్వంలో పెండింగ్ ఉండరాదన్న ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20 : స్వచ్ఛతను క్రమం తప్పక పాటించేలా చూడటానికి, ప్రభు త్వంలో పెండింగ్ ను తగ్గించడానికి ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికత నుంచి పొందిన ప్రేరణతో కేంద్ర హోం శాఖ మంత్రి శ్రీ అమిత్ షా మార్గదర్శకత్వంలో ప్రత్యేక ప్రచారం 4.0 ను క్రియాశీలకంగా నిర్వహిస్తోంది. ఈ ప్రచారం 4.0లో సన్నద్ధత దశ (సెప్టెంబర్ 15-30), అమలు దశ (2024 అక్టోబర్ 2-31) అనే రెండు దశలు ఉంటాయి. డిపార్ట్ మెంట్ ఆఫ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్ అండ్ పబ్లిక్ గ్రీవెన్స్ (డీ ఏ ఆర్ పీ జీ )ఈ క్యాంపెయిన్ ను నిర్వహిస్తోంది. మంత్రిత్వ శాఖలో చేపట్టిన ప్రత్యేక ప్రచారంతో పెండింగ్ లో ఉన్న పార్లమెంటు సభ్యుల ప్రతిపాదనలు, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతిపాదనలు, పార్లమెంటు హామీలు, మంత్రిత్వ శాఖల మధ్య సంప్రదింపులు , ప్రజా ఫిర్యాదుల/అప్పీళ్ల పరిష్కారం, రికార్డుల మెరుగైన నిర్వహణ తో పాటు పని ప్రదేశాలను సుస్థిరంగా, పర్యావరణహితంగా ఉంచడంపై దృష్టి పెట్టింది.

స్పెషల్ క్యాంపెయిన్ 4.0 అమలును మంత్రిత్వ శాఖలో అత్యున్నత స్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. సెంట్రల్ ఆర్మ్ డ్ పోలీస్ ఫోర్సెస్ (సిఎపిఎఫ్) ,సెంట్రల్ పోలీస్ ఆర్గనైజేషన్ (సిపిఒ)లకు , ఈ స్పెషల్ క్యాంపెయిన్ 4.0 ప్రాముఖ్యతను వివరించి నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం ఉత్తమ ఫలితాలు రాబట్టేందుకు సమష్టిగా పనిచేయాలని ప్రోత్సహిస్తున్నారు.

స్పెషల్ క్యాంపెయిన్ 3.0కు కొనసాగింపుగా 2023 నవంబర్ నుంచి 2024 ఆగస్టు వరకు నెలవారీగా పెండింగ్ అంశాలను తగ్గించడానికి హోం మంత్రిత్వ శాఖ ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహించింది. ఈ సమయంలో ఎంపీలు చేసిన 352 ప్రతిపాదనలు , 10 పార్లమెంటరీ హామీలు, 3 క్యాబినెట్ ప్రతిపాదనలు, 70 రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలు, 29 ప్రధాన మంత్రి కార్యాలయం ఆదేశాలను పరిష్కరించారు. అలాగే, నవంబర్ 2023 నుండి ఆగస్టు 2024 మధ్య మొత్తం 40,894 ప్రజా ఫిర్యాదులు,. 3173 ప్రజా ఫిర్యాదుల అప్పీళ్లను ను మంత్రిత్వ శాఖ పరిష్కరించింది.

సామాన్య ప్రజలతో సంబంధం ఉన్న ఫీల్డ్/ఔట్‌స్టేషన్ కార్యాలయాలపై ప్రత్యేక దృష్టితో వివిధ ప్రాంతాల్లో 4613 స్వచ్ఛతా ప్రచారాలను మంత్రిత్వ శాఖ నిర్వహించింది. సి ఎ పి ఎఫ్ కార్యాలయాల్లో పనికి రాని సామగ్రి, ఫైళ్లు తొలగించడంతో 1,04,483 చదరపు అడుగుల స్థలం అందుబాటులోకి వచ్చింది.

ప్రత్యేక ప్రచారానికి సంబంధించిన వివరాలను మంత్రిత్వ శాఖలోని అన్ని విభాగాలు అప్‌లోడ్ చేసే విధంగా, ఒక అంతర్ మంత్రిత్వ శాఖ పోర్టల్‌ను కూడా అభివృద్ధి చేశారు. అన్ని విభాగాలతో సమర్థంగా సమన్వయం చేసుకోవడానికి, తద్వారా ఎటువంటి జాప్యం లేకుండా సరైన డేటాను పొందడానికి ఇది ఎంహెచ్ఏ అనుసరించిన ఉత్తమ పద్ధతులలో ఒకటి.

# 'వరల్డ్ ఫుడ్ ఇండియా 2024' పేరిట రేపటి నుంచి నాలుగు రోజులపాటు న్యూఢిల్లీలో భారీ సదస్సు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20 : న్యూఢిల్లీ భారత మండపంలో 70,000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో జరిగే 'వరల్డ్ ఫుడ్ ఇండియా 2024' సదస్సుకు కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆతిథ్యం ఇవ్వనుంది. సెప్టెంబర్ 19 నుంచి 22 వరకు జరిగే ఈ కార్యక్రమంపై సర్వత్రా ఆసక్తి నెలకొని ఉంది. సమావేశాల్లో 90 కి పైగా దేశాలు, 26 రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాలు, 18 కేంద్ర మంత్రిత్వశాఖలు, సంబంధిత విభాగాలు పాల్గొంటాయి. ఆహార తయారీ లేదా ఆహార శుద్ధి రంగంలో సృజనాత్మకత, నూతన సాంకేతికత, పర్యావరణహిత అంశాల కలబోతగా ఈ సదస్సు ఉంటుంది.

సదస్సు ప్రారంభానికి మరొక్క రోజే ఉండడంతో దేశ విదేశ ప్రతినిధులకు అపురూపమైన అనుభూతిని అందించేందుకు కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రిత్వశాఖ అన్ని సన్నాహాలూ చేస్తోంది. ప్రపంచ మేటి ఫుడ్ ప్రాసెసింగ్ దేశంగా ఆవిర్భవిస్తున్న భారత్ సత్తాను ఈ నాలుగు రోజుల కార్యక్రమం చాటుతుంది.

కార్యక్రమంలో కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజాపంపిణీ, పునరుత్పాదక ఇంధన మంత్రి శ్రీ ప్రహ్లాద జోషి, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ చిరాగ్ పాశ్వాన్, కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల శాఖ/ రైల్వే శాఖల సహాయ మంత్రి శ్రీ రవ్ నీత్ సింగ్ బిట్టు పాల్గొంటారు. శ్రీయుతులు చిరాగ్ పాశ్వాన్, రవ్ నీత్ సింగ్ పరిశ్రమల నేతలతో ప్రత్యక్షంగా భేటీ అవుతారు. విదేశీ ప్రతినిధులతో, ఆయా దేశాల మంత్రులతో ద్వైపాక్షిక సమావేశాలను నిర్వహిస్తారు.

భారతదేశంలో ఆహార తయారీ రంగ అభివృద్ధి, భవిష్య ప్రణాళికలు, ప్రభుత్వ పథకాలు వంటి అంశాలను కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ చిరాగ్ పాశ్వాన్ తమ ప్రసంగం ద్వారా ప్రముఖులతో పంచుకుంటారు.

తొలి రోజు జరిగే ఉన్నతస్థాయి సీఈఓల రౌండ్ టేబుల్ సమావేశానికి కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి శ్రీ పీయూష్ గోయల్, మరో మంత్రి శ్రీ చిరాగ్ పాశ్వాన్ తో సహ అధ్యక్షత వహిస్తారు. శ్రీ రవ్ నీత్ సింగ్ బిట్టు సమావేశాన్నుద్దేశించి ప్రసంగిస్తారు.

అపెడా, ఎంపెడా, ఇతర ఉత్పత్తుల బోర్డులు ఏర్పాటు చేస్తున్న రివర్స్ బయ్యర్స్ మీట్ లో వెయ్యి మందికి పైగా కొనుగోలుదార్లు పాల్గొననున్నారు. వరల్డ్ ఫుడ్ ఇండియా 2024 కార్యక్రమం జరిగే సమయంలోనే, సెప్టెంబర్ 20,21 తేదీల్లో ఆహార భద్రతా సంస్థ ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆధ్వర్యంలో ప్రపంచ ఆహార భద్రతాధికారా సదస్సు రెండో దఫా సమావేశాలు జరుగుతాయి. వరల్డ్ ఫుడ్ ఇండియా 2024కి జపాన్ భాగస్వామ్య దేశంగా వ్యవహరించనుంది. వియత్నాం ఇరాన్ దేశాలు ప్రత్యేక అధ్యయన దేశాలుగా పాల్గొంటున్నాయి.

కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక ఇతివృత్తాలపై చర్చలు సహా 40 ఎంపిక చేసిన అంశాలపై సదస్సులు, వివిధ రాష్ట్రాలు, దేశాలపై ప్రత్యేక సదస్సులు ఉంటాయి. ప్రపంచ అగ్రి ఫుడ్ కంపెనీలకు చెందిన 100 మంది సీఈఓలు పాల్గొనే పరిశ్రమ వర్గాల అంశాల వారీగా చర్చలు ఏర్పాటవుతున్నాయి.

సీనియర్ విధానకర్తలు, విదేశీ ప్రముఖులు, పరిశ్రమ పెద్దలు, విద్యావేత్తలను ఒక దగ్గరకు చేర్చే ప్రారంభ వేడుక, సమావేశాలకి శుభారంభాన్ని ఇవ్వనుంది. ఆహార పరిశ్రమ రంగంలోని వివిధ కోణాలను పరిచయం చేసే అంతర్జాతీయ పెవిలియన్, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖల పెవిలియన్, పెంపుడు జంతువుల కోసం ప్రత్యేకమైన పెవిలియన్ వంటి వివిధ ప్రదర్శనలను వివిధ హాళ్లలో ఏర్పాటు చేశారు. హాల్ నెంబర్ 14 లో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రిత్వ శాఖ చేపట్టిన కొత్త పథకాలు, అంకుర పరిశ్రమల సృజనాత్మకతను ప్రదర్శిస్తారు. టెక్నాలజీ పెవిలియన్ లో ఆహార తయారీ రంగంలో యంత్రాలు, ఆహార భద్రత, ఉత్తమ ప్యాకేజింగ్ తదితర రంగాలలో తాజా ప్రగతి గురించిన ప్రదర్శనలు ఉంటాయి. అంతే కాక ఆహార తయారీ యంత్రాలు, ప్యాకేజింగ్, ఆహార వడ్డన ఉపకరణాల ఆధునిక పోకడలను ప్రదర్శించేందుకు ప్రత్యేక స్థలం కేటాయిస్తారు.

వరల్డ్ ఫుడ్ ఇండియా 2024 కార్యక్రమాన్ని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు మన దేశంలోని వివిధ రాష్ట్రాల స్థానిక వంటల ప్రత్యేకత చాటే విధంగా 'స్వాద్ సూత్ర' పేరిట వంటల పోటీని ఏర్పాటు చేశారు.

ప్రభావవంతమైన చర్చలకు వేదికగా నిలిచేందుకు, నూతన భాగస్వామ్యాలకు అవకాశం కల్పించేందుకు, ప్రపంచ ఆహార పరిశ్రమలో పెరుగుతున్న భారత ప్రాముఖ్యాన్ని తెలియచేయడం లక్ష్యంగా కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో జరగనుంది.

# విదేశీ గడ్డపై భారతదేశ సార్వభౌమాధికారాన్ని, రాజ్యాంగాన్ని అపహాస్యం చేసాడు

**-కాంగ్రెస్ పార్టీ నైజం ఏంటో రాహుల్ ప్రపంచానికి చాటారు.**

**-కాంగ్రెస్ పార్టీ మొదటి నుండి పేదలు, దళితులు, గిరిజనుల పట్ల నిర్లక్ష్య వైఖరిని అవలంభిస్తోంది**

**- బిజెపి ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్**



హైదరాబాద్ సెప్టెంబర్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ):అమెరికా పర్యటనలో భారతదేశం, ప్రజాస్వామ్యం పట్ల, భారత దేశప్రజలను అవమానించేలా రాహుల్ గాంధీ వ్యాఖ్యలు చేయడాన్ని బిజెపి ఖండిస్తోందని బిజెపి ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ తెలిపారు.శుక్రవారం భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి , బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ తో కలిసి మాట్లాడారు.విదేశీ గడ్డపై భారతదేశ సార్వభౌమాధికారాన్ని, రాజ్యాంగాన్ని అపహాస్యం చేసేలా మాట్లాడారు.కాంగ్రెస్ పార్టీ నైజం ఏంటో అనేది అమెరికా గడ్డపై నుంచి రాహుల్ ప్రపంచానికి చెప్పారన్నారు.కాంగ్రెస్ పార్టీ మొదటి నుండి పేదలు, దళితులు, గిరిజనుల పట్ల నిర్లక్ష్య వైఖరిని అవలంభిస్తోందని,.వారిని కేవలం ఓటుబ్యాంకు గానే చూస్తున్నది తప్ప.. రాజ్యాంగపరంగా కల్పించాల్సిన హక్కుల గురించి ఏమాత్రం పట్టించుకోలేదని విమర్శించారు.భారత రాజ్యాంగాన్ని ఆమోదించుకున్న తర్వాత వాటిని అమలు చేయాల్సిన బాధ్యత ఆయా ప్రభుత్వాలది.సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి రిజర్వేషన్లు కల్పిస్తూ బాబాసాహెబ్ అంబేద్కర్ గారు రాజ్యాంగాన్ని రూపొందించారని తెలిపారు.అమెరికా వేదికగా కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాహుల్ గాంధీ రిజర్వేషన్లు తొలగిస్తామంటూ రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు.తొలి నుంచి గాంధీ కుటుంబం ఎస్సీ, ఎస్టీల పట్ల నిర్లక్ష్య వైఖరే అవలంభిస్తోంది.1956 నాటి కాకా కలేల్కర్ వెనుకబడిన తరగతుల కమిషన్ నివేదికను తిరస్కరించింది.జవహర్ లాల్ నెహ్రూ, జూన్ 27, 1961 నాటి తన లేఖలో, అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులందరినీ ఉద్దేశించి, ఏ కులానికి లేదా వర్గానికి రిజర్వేషన్లు మరియు ప్రత్యేకతలు కల్పించడాన్ని వ్యతిరేకించారన్నారు..కాంగ్రెస్ కు మొదటి నుంచీ బాబా సాహెబ్ అంబేద్కర్ గారి పట్ల వ్యతిరేక భావన ఉంది.1952, 54లో కాంగ్రెస్ అంబేద్కర్ గారిని ఎన్నికల్లో ఓడించి చట్టసభల్లో అడుగుపెట్టకుండా కుట్ర చేసింది కాంగ్రెస్ పార్టీ.1975లో ఇందిరాగాంధీ ప్రభుత్వం ఎమర్జెన్సీని విధించి రాజ్యాంగ విలువలను తీవ్రంగా దెబ్బతీసే ప్రయత్నం చేశారు. కాంగ్రెస్ తన హయాంలో 100 కి పైగా సార్లు రాజ్యాంగాన్ని సవరించింది. బీజేపీని ఎప్పుడూ విమర్శించే కాంగ్రెస్ గురించి ప్రజలకు ఈ వాస్తవం తెలియాలి.ఎస్సీ/ఎస్టీ రిజర్వేషన్లలో సబ్-కోటాలపై మండల్ కమిషన్ సిఫార్సులను కూడా కాంగ్రెస్ వ్యతిరేకించింది.గత సార్వత్రిక ఎన్నికల్లోనూ బిజెపి రిజర్వేషన్లను మారుస్తుందంటూ కాంగ్రెస్ పార్టీ అసత్యపు ఆరోపణలు చేసి ప్రజలను మభ్యపెట్టి రాజకీయంగా లబ్ధిపొందే ప్రయత్నం చేసిందని దుయ్యబట్టారు..మార్చి 3, 1985లో రిజర్వేషన్ల ద్వారా మూర్ఖులను ప్రోత్సహించవద్దంటూ రాజీవ్ గాంధీ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ హయాంలో దేశంలో పేదరికంతో అల్లాడిపోయింది. సుమారు 20 వేలకు పైగా గ్రామాలు కనీసం నీటి సౌకర్యానికి కూడా నోచుకోలేని పరిస్థితి ఉండేది.ప్రతి మనిషికి కూడు..గూడు..గుడ్డ కనీస అవసరాలు కల్పించిఉంటే అలాంటి పరిస్థితులు దాపురించేవి కావు.రాజ్యాంగ పరిరక్షణకు భరోసా ఇస్తున్నది ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం మాత్రమే.ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి మార్చుకోవాలని హెచ్చరించారు.

# కొరియోగ్రఫర్ జానీ మాస్టర్‌కు కోర్టు 14 రోజుల పాటు జ్యుడిషియల్ రిమాండ్

**-చంచల్ గూడ జైలుకు తరలించిన పోలీసులు**

హైదే్ౖరాబాద్ సెప్టెంబర్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );లైంగిక వేధింపుల కేసులో ప్రముఖ కొరియోగ్రఫర్ జానీ మాస్టర్ కు ఉప్పరపల్లి కోర్టు షాకిచ్చింది. 14 రోజుల పాటు జ్యుడిషియల్ రిమాండ్ విధించింది. అక్టోబర్ 3 వరకు రిమాండ్‌లో ఉంచాలని ఆదేశించింది.జానీ మాస్టర్ ఓ డ్యాన్సర్‌పై లైంగిక వేధింపులకు పాల్పడిన వివాదం సినీ ఇండస్ట్రీలో చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. ఈ వివాదంలో జానీ మాస్టర్‌పై ఐపీసీ సెక్షన్ 376, 506, 323(2)తోపాటు పోక్సో కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో గోవాలో జానీ మాస్టర్‌ను అదుపులోకి తీసుకున్న సైబరాబాద్ పోలీసుల బృందం హైదరాబాద్‌కు తీసుకొచ్చారు.అనంతరం రాజేంద్రనగర్ సీసీఎస్ కార్యాలయంలో సీక్రెట్‌గా విచారించిన అనంతరం జానీ మాస్టర్‌ను ఉప్పరపల్లి కోర్టు ముందు హాజరుపరిచారు. ఈ సందర్భంగా కోర్టు జానీ మాస్టర్‌కు 14 రోజుల రిమాండ్ విధించింది. కోర్టు తీర్పుతో అక్టోబర్ 3 వరకూ కొరియోగ్రఫర్ రిమాండ్‌లోనే ఉండనున్నారు. ఆయన్ని పోలీసులు చంచల్ గూడ జైలుకు తరలించారు. మరోవైపు ఆయన బెయిల్ కోసం రంగారెడ్డి కోర్టును ఆశ్రయించినట్లు తెలిసింది.పోలీసుల విచారణలో జానీ మాస్టర్ సంచలన విషయాలు చెప్పినట్టు తెలుస్తోంది. ఈ సందర్భంగా జానీ మాస్టర్ మాట్లాడుతూ.. నేను ఎలాంటి లైంగిక వేధింపులకు పాల్పడలేదు. కావాలనే కొందరు నాపై ఫిర్యాదు చేయించారు. న్యాయపరంగా పోరాడి నిజాయితీగా బయటకు వస్తా. నన్ను ఇరికించినవాళ్లను వదిలిపెట్టనని హెచ్చరించాడు.నార్సింగి పోలీసులు ఈ కేసు విచారణలో భాగంగా ఇప్పటికే బాధితురాలి వాంగ్మూలం తీసుకున్నారు. బాధితురాలి ఇంట్లోనే విచారించిన పోలీసులు వివరాలు సేకరించారు. అనంతరం బాధితురాలికి వైద్య పరీక్షలు కూడా నిర్వహించారు. జానీ మాస్టర్ నాపై అత్యాచారం చేసి దాడి చేశాడు. షూటింగ్ టైంలో క్యారవాన్‌లో బలవంతం చేశాడు. సెక్స్ కోరిక తీర్చమని నన్ను ఎంతో వేధించాడు. తన మాట వినకపోతే ఆఫర్లు రాకుండా చేస్తానని బెదిరించాడు. పెళ్లి చేసుకోవాలని జానీ మాస్టర్ తనపై ఒత్తిడి చేశాడని బాధితురాలు తన స్టేట్‌మెంట్‌లో పేర్కొంది.

# కవ్వాల అభయారణ్యంలో అక్రమంగా ఉన్న 10మంది అరెస్ట్ !



ఆదిలాబాద్, సెప్టెంబర్ 20 : మంచిర్యాల జిల్లా కవ్వాల అభయారణ్యంలోని అడవుల్లో అక్రమంగా నివాసముంటున్న పదిమందిపై అటవీ అధికారులు (శుక్రవారం) సాయంత్రం అరెస్టు చేశారు. కవ్వాల పులుల అభయారాణ్యంలోని జన్నారం డివిజన్ ఇందనపల్లి రేంజ్ కంపార్ట్ మెంట్ నెం.249 అడవిలో కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన 10 మంది అక్రమంగా చొరబడి నెల రోజులుగా అక్కడే ఉంటున్నారు. దీంతో వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972 కింద కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఇందనపల్లి రేంజ్ అధికారి ఎండీ హఫీజుద్దీన్ తెలిపారు.కవ్వాల అటవీ ప్రాంతంలో గత నెల రోజులుగా పులి సంచరిస్తోందని, వన్యప్రాణులకు ఎలాంటి హాని జరగకుండా చర్యలు తీసుకుంటున్న క్రమంలో? అడవిలో అక్రమంగా ఉంటున్న కుమ్రం లక్ష్మణ్, సిడాం మోతిరాం, మేస్రం గంగారాం, నైతం మాన్కు, తోడసం విష్ణు, సిడం బాలు, ఆత్రం లాల్ సావ్, పెందోర్ సురేబాన్, పెందోర్ జలపతి రావు, కనక చంద్రబాన్ లను అరెస్ట్ చేసి లక్షెట్టిపేట కోర్టులో హాజరు పర్చినట్లు ఆయన చెప్పారు. నిందితులను సెక్షన్, బిట్ ఆఫీసర్లు కృష్ణారావు, అమృతరావ్ తదితరులు పట్టుకున్నారన్నారు

# తిరుమల లడ్డూ పై సీబీఐ విచారణ జరిపించాలి

**-ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్**

**-కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా కు షర్మిల లేఖ**

అమరావతి సెప్టెంబర్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );తిరుమలలో లడ్డూ వ్యవహారం దేశ వ్యాప్తంగా దుమారం రేపుతోంది. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని గత ప్రభుత్వ హయాంలో తిరుమలలో తయారయ్యే ఈ లడ్డూలో జంతువుల కొవ్వు కలిపినట్లు ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ అంశంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై పలువురు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

లడ్డూ కల్తీ వ్యవహారంపై జగన్ సోదరి, ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రంగా స్పందించారు.అత్యంత పవిత్రమైన తిరుపతి లడ్డూలో జంతువుల కొవ్వు వాడటం చిన్న విషయం కాదని అన్నారు. శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడారు. ఈ వివాదం కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతీసిందని అన్నారు.

ఇంత పెద్ద విషయాన్ని సీఎం చంద్రబాబు ఎలా ఈజీగా తీసుకున్నారో తనకు అర్థం కావడం లేదన్నారు. ఈ అంశాన్ని కాంగ్రెస్ పార్టీ సీరియస్‌గా తీసుకుందన్నారు. ఇది చిన్న సమస్య కాదని, దీనిపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా కు షర్మిల లేఖ రాశారు.

# మండల స్థాయి ఎస్జిఎఫ్ గేమ్స్ & స్పోర్ట్స్ మీట్ లో పాల్గొన్న ఎమ్మెల్యే



భద్రాద్రికొత్తగూడెం, సెప్టెంబర్ 20 (నేటినిజం ప్రతినిధి) : దమ్మపేట మండలం పార్కలగండి ఆశ్రమపాఠశాలలో మండల స్థాయిలో ఎస్జిఎఫ్ అన్ని పాఠశాలల విద్యార్థులకు జరుగుతున్న ఆటల పోటీలకు ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పాల్గొని క్రీడాకారుల పరిచయ కార్యక్రమం అనంతరం పిల్లలతో కలిసి సరదాగా కబడ్డీ ఆడారు. అనంతరం క్రీడలను ఉద్దేశించి ప్రసంగించి ప్రథమ ద్వితీయ స్థానాలలో నిలిచిన జట్లకు బహుమతులు ప్రధానోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలోకాంగ్రెస్ పార్టీ నాయకులు,ఉపాధ్యాయులు, పలు పాఠశాలల విద్యార్థులు, తదితరులున్నారు.

# నాత్ శరీఫ్ ఆలపించిన చిన్నారులకు రూ.52వేల నగదు అందజేసిన సుప్రీం జావిద్



కరీంనగర్, సెప్టెంబర్ 20: (నేటినిజం ప్రతినిధి) మహమ్మద్ ప్రవక్త జన్మదిన పురస్కరించుకొని నగరంలోని హుస్సేనీపురాలో 5సంవత్సరాల నుంచి 12సంవత్సరాల లోపు వయస్సు కలిగిన చిన్నారులకు నిర్వహించిన నాత్ కి మహిఫిల్ లో విజేతలకు కరీంనగర్ బైక్ ఆటో కన్సల్ట్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సుప్రీం జావిద్ రూ. 52వేల నగదును ప్రోత్సాహకంగా అందించి ఉదార స్వభావాన్ని చాటారు. నాత్ కి మహిఫిల్ కాంటెస్ట్ లో మొదటి బహుమతి సాధించిన విజేతకు 15వేలు, ద్వితీయ విజేతకు 10వేలు, తృతీయ బహుమతిగా 5వేలను నగదు రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మిగతా చిన్నారులందరికీ వారి ప్రతిభను ప్రోత్సహించాలని ఉద్దేశంతో ప్రతి ఒక్కరికి వెయ్యి రూపాయల చొప్పున నగదు అన్న చేశారు. ఈ బహుమతుల ప్రధానోత్సవం కార్యక్రమం నగరంలోని సర్కస్ గ్రౌండ్లో ఏర్పాటు చేసిన జల్సా ఆధ్యాత్మిక సదస్సులో పంపిణీ చేశారు. చిన్నారులను ప్రోత్సహించాలని సంకల్పంతో ముందుకొచ్చి కార్యక్రమాన్ని నిర్వహించి వారికి నగదు రూపంలో 52,000 అందించిన సుప్రీం జావిద్ ఉదార స్వభావం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

# తెలంగాణలో అసమర్ధపాలన .. తప్పుడు లెక్కలతో కాలం వెల్లదీస్తున్న కాంగ్రెస్ : మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి



హైదరాబాద్, సెప్టెంబర్ 20 : రాష్ట్రంలో అసమర్ధ పాలన నడుస్తోందని, ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి ఆరోపించారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సీఎం సహాయ నిధి నుంచి వచ్చిన 35 షాదీముబారక్, కళ్యాణలక్ష్మి చెక్కులను లబ్ధి దారులకు అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారంలోకి రావడానికి అనేక తప్పుడు వాగ్దానాలు చేసిందని విమర్శించారు. మహిళలకు తులం బంగారం ఇస్తామని చెప్పి, ఇంత వరకు ఎందుకు ఇవ్వలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఇస్తామన్న రూ. 2, 500లు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. రైతులకు రుణమాఫీకి సంబంధించి ఎంత మందికి చేశారో సరైన లెక్కలు లేవన్నారు. అన్ని తప్పుడు వాగ్దానాలు, తప్పుడు లెక్కలతో కాలం వెల్లదీస్తుందని మండిపడ్డారు.

ప్రజలను మోసం చేయడమే తప్ప మంచి చేయడం రాదన్నారు. సూపర్ సిక్స్ గ్యారంటీల సంగతి తేల్చకుండా ఆరోపణలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ చిగిరింత పారిజాత నర్సింహా రెడ్డి, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కమిషనర్ రఘుకుమార్, కార్పొరేటర్లు, అధికారులు తదితరులు ఉన్నారు.

# ప్రజల కంటే సనాతన ధర్మం ముఖ్యమా.?. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

అమరావతి, సెప్టెంబర్ 20 : తిరుమల లడ్డూ వివాదం ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో పెద్ద దుమారం రేపుతున్న విషయం తెలిసిందే.. శ్రీవారి లడ్డూ తయారీలో స్వచ్ఛమైన నెయ్యికి బదులు జంతువుల నూనెలను వాడారని వచ్చిన నివేదికలు భక్తుల్లో ఆగ్రహానికి కారణమవుతున్నాయి. అయితే ఈ విషయంపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ స్పందిస్తూ.. తిరుమల లడ్డూలో జంతువుల కొవ్వు నూనెలు వినియోగించడం భక్తుల మనోభావాలను దెబ్బతీశాయని అన్నారు. వైసీపీ హయాంలో ఉన్న టీటీడీ బోర్డు దీనికి సమాధానం చెప్పాలని అన్నారు. ఆలయాల్లో జరిగే అంశాల పర్యవేక్షణకు జాతీయస్థాయిలో సనాతన ధర్మరక్షణ బోర్డు ఏర్పాటు చేయాల్సిన సమయం వచ్చిందని అభిప్రాయపడ్డారు. సనాతన ధర్మానికి ఏ రూపంలో ముప్పు వచ్చినా మనమంతా కలిసి నిర్మూలించాలని పిలుపునిచ్చారు.

ఇదిలావుంటే పవన్ చేసిన వ్యాఖ్యల పట్ల సోషల్ మీడియాలో సపోర్ట్‌తో పాటు ట్రోలింగ్ కామెంట్లు వస్తున్నాయి. ముఖ్యంగా మత విద్వేషాలను రెచ్చగొట్టే బీజేపీ పార్టీ నాయకుడిలా పవన్ కళ్యాణ్ మారుతున్నాడు అని నెటిజన్లు కామెంట్లు చేయడం మొదలుపెట్టారు. అలాగే పవన్ కళ్యాణ్‌కు సనాతన ధర్మ రక్షకుడిగా ఉండేందుకు సమయం ఉంది కానీ.. తన సొంత పార్టీ కార్యకర్త అయిన జానీ మాస్టర్ ఒక అమ్మాయిని రేప్ చేశాడంటూ ఆరోపణలు ఎదుర్కొంటుంటే ఆ విషయంపై స్పందించడానికి కూడా డిప్యూటీ సీఎంకు సమయం దొరకట్లేదని.. ముందు మీ ప్రజలు గురించి ఆలోచించండి.. ఆ తర్వాత మతం గురించి ఆలోచిస్తారు అంటూ కామెంట్లు పెడుతున్నారు నెటిజన్లు.

# 2030-31 నాటికి 6.7 శాతం వార్షిక వృద్ధితో..మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్



హైదరాబాద్, సెప్టెంబర్ 20 : భారతదేశం 2030-31 నాటికి 6.7 శాతం వార్షిక వృద్ధితో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలవనుందని ఎస్‌&పీ గ్లోబల్ ఇండియా విడుదల చేసిన తొలి నివేదిక 'ఇండియా ఫార్వర్డ్ : ఎమర్జింగ్ పర్స్పెక్టివ్స్'లో వెల్లడించింది. ఈ సందర్భంగా ఎస్‌&పీ గ్లోబల్ ఇండియా లీడర్‌షిప్ కౌన్సిల్ హెడ్, గ్లోబల్ మార్కెట్ ఇంటెలిజెన్స్ చీఫ్ డేటా ఆఫీసర్ అభిషేక్ తోమర్ మాట్లాడుతూ 2024 ఆర్థిక సంవత్సరంలో 8.2 శాతం వృద్ధి రేటును నమోదు చేసిందన్నారు. 6.7 శాతం సగటు వృద్ధి రేటుతో ముందుకు సాగుతుందని నివేదిక అంచనా వేసిందన్నారు. వాణిజ్యం, వ్యవసాయం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి రంగాలలో సంస్కరణలు, ఎనర్జీ డిమాండ్ ఈ వృద్ధికి తోడ్పడతాయని పేర్కొన్నారు. భారత్ అంచనాలను మించి 8.2 శాతం వృద్ధితో ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిచిందన్నారు. మునుపటి అంచనా 7.3 శాతం కంటే మించి ఉందన్నారు. వాణిజ్యం కోసం తీర ప్రాంతాలలో నౌకాశ్రయాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటలైజేషన్ ద్వారా ఆర్థిక వృద్ధి సాధించవచ్చన్నారు. గ్లోబల్ ఎకనామిక్ ల్యాండ్‌స్కేప్‌ను రూపొందించడానికి యువ, డైనమిక్ వర్క్‌ఫోర్స్ మంచి స్థానంలో ఉందన్నారు. వ్యాపార లావాదేవీలు, లాజిస్టిక్‌లను మెరుగుపరచడానికి, ప్రైవేట్ రంగ పెట్టుబడులను పెంచడానికి, ప్రభుత్వ మూలధనంపై ఆధారపడటాన్ని తగ్గించాలన్నారు. నిరంతర సంస్కరణలు కీలకమన్నారు. ప్రభుత్వ బాండ్లలోకి విదేశీ ఇన్‌ఫ్లోలు పెరిగాయన్నారు. మౌలిక సదుపాయాలు, భౌగోళిక రాజకీయ వ్యూహాలను అభివృద్ధి చేయాలన్నారు. తీరప్రాంతానికి సంబంధించి.. దాదాపు 90 శాతం వాణిజ్యం సముద్రమార్గం, పెరుగుతున్న ఎగుమతులు, బల్క్ కమోడిటీ దిగుమతులను నిర్వహించడానికి ఓడరేవు మౌలిక సదుపాయాలు అవసరమన్నారు. ఉత్పాదకతను పెంచడానికి వ్యవసాయంలో అధునాతన సాంకేతికత విధానాలపై ఆధారపడుతుందని తెలిపారు.

# ఏపీలో రోజురోజుకీ దిగజారిపోతున్న టీడీపీ పరిస్థితి

## -జమిలీ ఎన్నికల తర్వాత బీజేపీలో టీడీపీ విలీనం అవుతుందా -ట్విట్టర్ (ఎక్స్) వేదికగా విజయసాయి రెడ్డి పలు సందేహాలు

అమరావతి సెప్టెంబర్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఏపీలో టీడీపీ పరిస్థితి రోజురోజుకీ దిగజారిపోతుందా అని వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి అనుమానం వ్యక్తం చేశారు. జమిలీ ఎన్నికల తర్వాత బీజేపీలో టీడీపీ విలీనం అవుతుందా అని ప్రశ్నించారు. ఈ మేరకు ట్విట్టర్ (ఎక్స్) వేదికగా విజయసాయి రెడ్డి పలు సందేహాలు వెలిబుచ్చారు.ఏపీలో టీడీపీ పరిస్థితి రోజురోజుకి దిగజారిపోతోందా? ర్టీలో ప్రభుత్వంలో సర్వం తానే చక్రవర్తి అన్నట్టు నారా లోకేష్ వ్యవహార శైలితో సీనియర్లు, సన్నిహితులు సహా విసిగిపోతున్నారా? మొన్న బాగున్న పార్టీ, అధికారంలోకి వచ్చిన 100 రోజులకే అనామకంగా అవ్వబోతోందా? అని విజయసాయిరెడ్డి ప్రశ్నించారు. జనం 135 స్థానాలు ఇచ్చి నీరాజనాలు పలికితే వంద రోజుల్లో పార్టీలో కుంపట్లతో అసంతృప్తులా! ఎందుకీ పరిస్థితి అని అనుమానం వ్యక్తం చేశారు. మొన్న మస్తాన్ రావు, మోపిదేవి, నిన్న బాలినేని, సామినేని ?.లిస్ట్ ఇంకా ఉందా అని వ్యాఖ్యానించారు. ఇంకెంతమందిని అవినీతి సొమ్ముతో కొంటారని నిలదీశారు. రాష్ట్రఅభివృద్ధికి నోచుకోక, సంక్షేమ పథకాలు అమలులో వైఫల్యంతో ఇక జమిలి ఎన్నికల తర్వాత టీడీపీ జెండా పీకేయ్యడమేనా అని అన్నారు. టీడీపీ బీజేపీ లోకి విలీనమౌతుందా అని ప్రశ్నించారు.విజయవాడ వరదల్లో అందరి ఇళ్లు మునిగాయి, నా ఇళ్లు మునిగింది. అయితే ఇప్పుడు ఏంటట అంటాడు సీఎం చంద్రబాబు అని విజయసాయిరెడ్డి అన్నారు.మోదీ

# భారీ మార్పు దిశగా- మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ రంగం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20 : యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్, ఎక్స్‌టెండెడ్ రియాలిటీ (ఏవీజీసీ-ఎక్స్ఆర్) కోసం నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (ఎన్‌సీఓఈ) ఆవిర్భవిస్తోంది. కంపెనీల చట్టం 2013 ప్రకారం సెక్షన్ 8 కంపెనీగా దీనిని రూపొందిస్తున్నారు. ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన ఈ రోజు జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశం ఈ ప్రతిపాదనను ఆమోదించింది. ఇండియన్ చాంబర్స్ అఫ్ కామర్స్ సమాఖ్య, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీలో ఉన్న పరిశ్రమల భాగస్వామ్యంతో ఈ సంస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ముంబయిలో ఎన్ సిఓఈ సంస్థను ఏర్పాటు చేస్తున్నారు. దేశంలో ఏవీజీసీ టాస్క్ ఫోర్స్ ఏర్పాటు కోసం కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల మంత్రి 2022-23 బడ్జెట్ ప్రకటనకు అనుగుణంగా ఇది ప్రారంభం అవుతోంది.

ఫిల్మ్ మేకింగ్, ఓవర్ ది టాప్ (ఓటీటీ), గేమింగ్, వాణిజ్య ప్రకటనలు, ఆరోగ్యం, విద్య, ఇతర సామాజిక రంగాలతో సహా మొత్తం మీడియా, వినోద రంగంలో ఏవీజీసీ-ఎక్స్ఆర్ రంగం నేడు ఒక అనివార్యమైన పాత్రను పోషిస్తుంది. దేశం అభివృద్ధి గమనంలో వెళుతున్నది. వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతికత, దేశవ్యాప్తంగా పెరుగుతున్న ఇంటర్నెట్, చౌక డేటా రేట్లతో పోటీ పడుతూ, ప్రపంచ వ్యాప్తంగా ఏవీజీసీ-ఎక్స్ఆర్ వినియోగం విపరీతమైన వేగంతో పెరగడానికి సిద్ధంగా ఉంది.

చురుకుగా సాగుతున్న ఈ వేగాన్ని కొనసాగించడానికి, దేశంలో ఏవీజీసీ-ఎక్స్ఆర్ విస్తరణ వ్యవస్థను ప్రోత్సహించడానికి, ఒక అత్యున్నత సంస్థగా నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ను స్థాపిస్తున్నారు. అత్యాధునిక ఏవీజీసీ-ఎక్స్ఆర్ టెక్నాలజీల్లో సరికొత్త నైపుణ్యాలతో ఔత్సాహికులు, నిపుణులను సన్నద్ధం చేయడానికి ప్రత్యేక శిక్షణ, బోధనా కార్యక్రమాలను అందిస్తుంది. పరిశోధన, అభివృద్ధిని ప్రోత్సహిస్తుంది. కంప్యూటర్ సైన్స్ వంటి వివిధ రంగాలకు చెందిన నిపుణులను ఒకచోట చేరుస్తుంది. ఇంజినీరింగ్, డిజైన్, ఆర్ట్... ఏవీజీసీ-ఎక్స్ఆర్ రంగంలో ప్రధాన పురోగతికి మార్గం వేస్తుంది. దేశవిదేశాల మార్కెట్ల కోసం భారతదేశం ఐపీని రూపొందించడంపై నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్- విస్తృతంగా దృష్టి సారిస్తుంది. మొత్తంగా ఇది భారతదేశ గొప్ప చారిత్రక, సాంస్కృతిక వారసత్వం ఆధారంగా కంటెంట్‌ను రూపొందించడానికి దారితీస్తుంది. ఇంకా, ఏవీజీసీ-ఎక్స్ఆర్ రంగంలో అంకుర సంస్థలు, ప్రారంభ-దశ కంపెనీలకు వనరులను అందించడం ద్వారా ఎన్ సీఓఈ ఒక ఇంక్యుబేషన్ సెంటర్‌గా పని చేస్తుంది. అలాగే, ఎన్ సీఓఈ విద్యారంగంతోపాటు, పరిశ్రమ రంగ అవసరాల కోసం కూడా పని చేస్తుంది.

ఈ ఎన్ సీఓఈ ని ఏవీజీసీ-ఎక్స్ఆర్ పరిశ్రమ వృద్ధికి చోదక శక్తిగా పని చేయడం ద్వారా దేశంలోని అన్ని ప్రాంతాల యువతకు ఇది అతిపెద్ద ఉపాధి వనరులలో ఒకటిగా ఉపయోగపడుతుంది. ఇది సృజనాత్మక కళలు, డిజైన్ రంగానికి అపారమైన ప్రోత్సాహాన్ని ఇస్తుంది. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాలను మరింతగా పెంచే ఏవీజీసీ-ఎక్స్ఆర్ కార్యకలాపాలకు భారతదేశాన్ని కేంద్రంగా మారుస్తుంది.

ఏవీజీసీ-ఎక్స్ఆర్ కోసం ఎన్ సీఓఈ అత్యాధునిక కంటెంట్‌ను అందించడానికి భారతదేశాన్ని కంటెంట్ హబ్‌గా ఉంచుతుంది. తద్వారా ప్రపంచవ్యాప్తంగా కళ పరంగా భారతదేశపు ప్రాభవాన్ని పెంచుతుంది. మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలోకి విదేశీ పెట్టుబడులను ఆకర్షిస్తుంది.

# చీడ తెగుళ్లను నివారించే కీటక నాశిని: రైతాంగానికి ఫెరోమోన్ డిస్పెన్సర్‌తో ఊరట

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20 : రైతులకు చీడ పురుగుల నుంచి, తెగుళ్ల నుంచి పంటను రక్షించుకునేందుకు పంటపొలాల్లో తక్కువ మొత్తంలో విడుదల అయ్యే సుస్థిర ఫెరోమోన్ డిస్పెన్సర్ ను శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఇది తెగుళ్లను నియంత్రించడంతో పాటు నిర్వహణ ఖర్చులను తగ్గిస్తుంది.

వ్యవసాయంలో కీటకాలు చీడపీడల నియంత్రణ ప్రధానమైనది. ఎందుకంటే కీటకాలు, పరాన్న జీవులు పంటపై దాడి చేసి ఏపుగా పెరుగుతున్న పంటను నాశనం చేస్తాయి.

వ్యవసాయ క్షేత్రంలో నియంత్రిత విడుదల రేటుతో సుస్థిర ఫెరోమోన్ డిస్పెన్సర్‌ను శాస్త్రవేత్తలు కనుగొన్నారు. బెంగళూరులోని జవహర్‌లాల్ నెహ్రూ సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ సైంటిఫిక్ రీసెర్చ్ (జేఎన్‌సీఏఎస్ఆర్), (కేంద్ర శాస్త్ర, సాంకేతిక విభాగంలోని స్వయంప్రతిపత్తి సంస్థ) నేషనల్ బ్యూరో ఆఫ్ అగ్రికల్చరల్ ఇన్‌సెక్ట్ రిసోర్సెస్ (ఐసిఏఆర్-ఎన్‌బీఏఐఆర్) శాస్త్రవేత్తలు పరిశోధన ప్రాజెక్టులో భాగంగా సంయుక్తంగా దీనిని అభివృద్ధి చేశారు. ఇది కీటకాల నియంత్రణతో పాటు నిర్వహణ ఖర్చులను గణనీయంగా తగ్గించడానికి రైతులకు సహాయపడనుంది.

శాస్త్రవేత్తలు తాము ప్రయోగశాలలో చేసిన ప్రయత్నాలను పరిశ్రమ స్థాయిలో ఉత్పత్తి చేయాలని భావిస్తున్నారు. తద్వారా రైతులకు నేరుగా పెద్ద ఎత్తున ప్రయోజనం చేకూరుతుందని భావిస్తున్నారు. ఈ మేరకు జేఎన్‌సీఏఎస్ఆర్, ఎన్‌బీఏఐఆర్ అధికారులు ఇటీవల హర్యానాలోని 'కృషి వికాస్ సహకారి సమితి లిమిటెడ్'తో ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందంపై జేఎన్‌సీఏఎస్ఆర్‌ఎం ఆచార్యులుఈశ్వరమూర్తి, ఐసీఏఆర్-ఎన్‌బీఏఐఆర్ డాక్టర్ కేశవన్ సుభారన్ సంతకాలు చేశారు. "ఫెరోమోన్ డిస్పెన్సర్ పై పరిశోధన జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తరించడానికి దోహదపడుతుంది. పరిశోధన ప్రయోజనాలు ప్రయోగశాల నుంచి వ్యవసాయ క్షేత్రానికి మారడం ద్వారా రైతాంగానికి ప్రయోజనం చేకూరుతుంది." అని ఆచార్యులు ఈశ్వరమూర్తి ప్రయోగ విశిష్టతను వివరించారు.

"ప్రస్తుతం పర్యావరణ అనుకూల సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడంపై శాస్త్రవేత్తలు దృష్టి సారిస్తున్నారు. ఈ క్రమంలో సెమియోకెమికల్స్ (ఫెరోమోన్స్ వంటి సిగ్నలింగ్ పదార్థాలు) పరిశ్రమలకు బదిలీ చేసినప్పుడు నియంత్రిత విడుదలపై అభివృద్ధి చేసిన సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఎక్కువ మొత్తంలో ఫెరోమోన్స్ ఉత్పత్తికి వీలు కలుగుతుంది" అని డాక్టర్ సుభాహరన్ తెలిపారు.

సుస్థిరమైన సేంద్రియ ఫెరోమోన్ డిస్పెన్సర్లు కొత్త భావన కాదు. వాస్తవానికి, ఫెరోమోన్లను విడుదల చేసే పాలిమర్ మెంబ్రేన్/పాలీప్రొపైలిన్ ట్యూబ్ డిస్పెన్సర్లు ఇప్పటికే మార్కెట్లో అధిక మొత్తంలో అందుబాటులో ఉన్నాయి. విడుదలైన ఫెరోమోన్లు కీటకాలు, చీడపురుగుల ప్రవర్తనను మార్చి, ఉచ్చులకు ఆకర్షిస్తాయి. అయితే, వాటి ప్రధాన లోపం ఫెరోమోన్లు గాలిలోకి విడుదలయ్యే రేటు స్థిరంగా ఉండదు. తద్వారా ఈ ఉచ్చులను తరచుగా తనిఖీ చేసి మార్చాలి, ఇది రైతులకు ఆర్థిక భారాన్ని పెంచడమే కాక శారీరక శ్రమను పెంచుతుంది.

ప్రస్తుతం జేఎన్‌సీఏఎస్ఆర్, ఎన్‌బీఏఐఆర్ శాస్త్రవేత్తలు తమ డిస్పెన్సర్ కు మెసోపోరస్ సిలికా మ్యాట్రిక్స్ ను ఉపయోగించడం ద్వారా ఈ సమస్యను పరిష్కరించారు. ఈ పదార్థం అనేక చిన్న రంధ్రాలతో క్రమబద్ధమైన నిర్మాణాన్ని కలిగి ఉంది. ఫెరోమోన్ అణువులను సులభంగా శోషించుకోని ఏకరీతిగా ఉంచడానికి అనుమతిస్తుంది. మెసోపోరస్ సిలికా ఇతర పదార్థాల కంటే అధికంగా జిగురు వంటి అతుక్కునే సామర్థ్యాన్ని కలిగి ఉండటమే కాకుండా, ఇది నిల్వ చేసిన ఫెరోమోన్‌ను వాతావరణ ఉష్ణోగ్రత వంటి బాహ్య పరిస్థితులతో సంబంధం లేకుండా మరింత స్థిరమైన పద్ధతిలో విడుదల చేస్తుంది.

శాస్త్రవేత్తలు రూపొందించిన ఫెరోమోన్ డిస్పెన్సర్ తో అమర్చిన పరికరాలను ఉపయోగించడం వల్ల అనేక ప్రయోజనాలున్నాయి. ఫెరోమోన్ తక్కువ మొత్తంలో విడుదలవుతూ, స్థిరమైన విడుదల రేటును కలిగి ఉంటుంది. దీని ప్రతీ విడుదల మధ్య విరామాలు ఎక్కువ ఉండటం వల్ల రైతుల పనిభారం తగ్గుతుంది. అదేవిధంగా డిస్పెన్సర్లను మరింత ఎక్కువ మొత్తంలో ఫెరోమోన్ తో నింపవచ్చు. ఈ విధంగా, ప్రతిపాదిత డిజైన్ డిస్పెన్సర్ అవసరమైన ఫెరోమోన్ మొత్తాన్ని కూడా తగ్గిస్తుంది. ఇది రైతులకు ఖర్చులను తగ్గించే అంశం. వ్యవసాయదారులకు అందుబాటులో ఉండి సుస్థిర వ్యవసాయ పద్ధతులకు దోహదం చేస్తుంది. "ప్రస్తుతం మార్కెట్లో రైతులకు అందుబాటులో ఉన్న డిస్పెన్సర్ల కంటే ఇది ఎంతో ఉపయుక్తమైనది. ఎందుకంటే వ్యవసాయ క్షేత్రంలో ఫెరోమోన్ వాడకం తక్కువ, అదేవిధంగా రైతులకు అయ్యే ఖర్చును తగ్గించడంలో సహాయపడుతుంది" అని డాక్టర్ సుభాహరన్ వివరించారు.

శాస్త్రవేత్తలు రూపొందించిన ఈ ఫెరోమోన్ డిస్పెన్సర్‌పై పరిశోధనశాలల్లో, పంటపొలాల్లో ప్రయోగాలు, పరీక్షలు విస్తృతంగా చేశారు. ఇందులో కీటకాలు, చీడపురుగులను ఆకర్షించే సామర్థ్యాన్ని విజయవంతంగా నమోదు చేసింది. కీటక ఆకర్షణ విషయంలో వాణిజ్య డిస్పెన్సర్లతో పోలిస్తే సమానంగా ఉన్నప్పటికీ, తక్కువ ఫెరోమోన్ విడుదల అనేది ఇందులో కీలకాంశం. ప్రస్తుతం చేసుకున్న ఒప్పందం ప్రకారం సంస్థ ఉత్పత్తి ప్రారంభిస్తే.. రైతులకు చీడపీడలను సమర్థవంతంగా నిర్వహించడానికి దోహదపడుతుందని ప్రొఫెసర్ ఈశ్వరమూర్తి తెలిపారు.

జెఎన్‌సీఏఎస్ఆర్, ఎన్‌బీఏఐఆర్ సంయుక్తంగా కేంద్ర శాస్త్ర సాంకేతిక విభాగం(డిఎస్టి), బయోటెక్నాలజీ విభాగం ఆర్థిక సహకారంతో దీనిని రూపొందించారు. సుస్థిర వ్యవసాయ పద్ధతుల ద్వారా వీరు చేసిన ఈ ప్రయత్నం సుస్థిర అభివృద్ధి లక్ష్యం (ఎస్డిజి) 2, జీరో హంగర్ (ఆకలితో అలమటించని) దిశగా ఒక ముఖ్యమైన అడుగు.

# కలుషితాలను గుర్తించే కొత్త కాగిత ఆధారిత పరికరాలు నానో శాస్త్రవేత్తల ఘనత

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20 : ఆధునిక పీపీపీ పెన్నును ఉపయోగించి, తక్కువ ఖర్చుతో కాగిత ఆధారిత పరికరాలను రూపొందించడానికి శాస్త్రవేత్తలు కొత్త విధానాన్ని అభివృద్ధి చేశారు. ఆధునిక సౌకర్యాల్లేని పరిమిత పరిస్థితుల్లో సంప్రదాయ గ్రాహక పద్ధతులను అనుసరించడం ఎంతో వ్యయం, నైపుణ్యతలూ అవసరం అవుతాయి.

అవసరమైన చోటుకు తీసుకుపోయే అవకాశం, తేలిగ్గా ఉపయోగించగలగడం, తక్కువ వ్యయం, లక్షిత ప్రయోజనం, వాడిన వెంటనే వాటిని పారవేయడం వంటి అవసరాల దృష్ట్యా, ఇటీవలి కాలంలో కాగిత ఆధారిత పరికరాల ప్రాధాన్యం పెరుగుతున్నది. కాగిత ఆధారిత పరికరాల రూపకల్పనలో- ఇంక్ జెట్ ప్రింటింగ్, మైనం ఆధారిత ప్రింటింగ్, లేజర్ చికిత్స, కరెక్షన్ పెన్నులు వంటివి ఉన్నాయి. వనరులు పరిమితంగా ఉంటే పరిస్థితుల్లో ఆయా పరికరాల రూపకల్పనలో క్లిష్టతరమైన పరికరాలనూ, యంత్రాలనూ ఉపయోగించాల్సి వస్తుంది. వేడి చేయాల్సిన, పొడిగా చేయాల్సిన దశలను కూడా అందులో ఉంచాల్సి వస్తుంది. అందువల్ల వాటి వాడకంలో కొంత క్లిష్టత కూడా ఏర్పడుతుంది.

పీపీపీ పెన్నును ఉపయోగించి ఎలాంటి క్లిష్టమైన యంత్రాలతో పనిలేకుండా, వేడి లేదా పొడిగా చేయాల్సిన దశలూ లేకుండా, సొంతంగా తయారు చేసుకోవడానికి వీలుండే పద్ధతిలో ఒక కొత్త తయారీ విధానాన్ని కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగం పరిధిలోని మొహాలీలోని నానో సైన్స్ అండ్ టెక్నాలజీ (ఐఎన్ఎస్టీ)కి చెందిన డాక్టర్ భాను ప్రకాష్ నేతృత్వంలోని శాస్త్రవేత్తల బృందం రూపొందించింది.

రసాయనిక పరంగా భార లోహాలు, నైట్రేట్లను గుర్తించేందుకు వీలుగా శాస్త్రవేత్తలు కాగిత ఆధారిత 2 తలాలు (2డీ) మాత్రమే ఉన్న పరికరాలను రూపొందించారు. ఇందుకోసం వారు ఏ-పీపీపీ గా పిలిచే పెన్నును ఉపయోగించారు. క్షితిజ రేఖామాన ప్రవాహాన్ని కలిగిన కాగితంతో తయారైన పరికరాన్ని ఉపయోగించి, జీవ రసాయన పరంగా డోపమైన్ అనే రసాయనాన్ని గుర్తించారు. తద్వారా వారు కనుగొన్న తయారీ విధానాన్ని విజయవంతంగా ప్రదర్శించగలిగారు. కాగితాన్ని మడవడం ద్వారా క్లిష్టమైన మూడు తలాలున్న (3డీ) పరికరంగా మార్చి, భార లోహాలను గుర్తించగలిగారు. కొన్ని సెకన్ల వ్యవధిలోనే ఈ కాగిత పరికరాలను తయారు చేసుకునేందుకు, ఉపయోగించుకునేందుకూ వీలుండటం విశేషం. ఒక పదార్థంలో భార లోహాలున్నదీ లేనిదీ క్షణాల్లో తెలుసుకోవచ్చు.

# ఖమ్మం మున్నేరు వరద బాధితుల సహాయార్థం సాంస్కృతిక సారధి కళాకారుల చేయూత



ఖమ్మం, సెప్టెంబర్ 20 : (నేటినిజం ప్రతినిధి): ఇటీవలి మున్నేరు వరదల ముంపు బాధితుల సహాయార్థం సాంస్కృతిక సారధి, జానపద కళాకారులు తమ వంతుగా ఖమ్మం నగరంలో గత మూడు నాలుగు రోజులుగా విరాళాలు సేకరించగా, వచ్చిన 50 వేల రూపాయలను శుక్రవారం కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ ముజ్మిల్ ఖాన్ కి అందజేశారు. వరద బాధిత నిరుద్యోగ కళాకారులు పిడియాల రాము, పెద్దపాక విజయ్, గుడిపల్లి పుల్లారావు, ఎల్తూరి మధు, చల్లా రంగ, మొగిలి వెంకటేశ్వర్లు, వరియోగుల స్వాతిలతో పాటు, బాధిత కళాకారులకు నిత్యావసర సరుకులు అందజేశారు. వరద బాధితుల సహాయార్థం అందించిన 50వేల రూపాయల సహాయానికి జిల్లా కలెక్టర్, సాంస్కృతిక సారధి, జానపద కళాకారులను ఈ సందర్భంగా అభినందించారు.

ఈ కార్యక్రమంలో పల్లె పాటల పాగి, మిమిక్రీ సుధాకర్, పరకాల అజయ్, కాల్వకట్ల జాన్, పీడియాల లక్ష్మణ్, ఆరెంపుల సతీష్, ఆదెర్ల శంకర్, అద్దంకి నరసింహారావు, మేడ ముత్తయ్య, బొమ్మెర ముత్యం, నకిరికంటి వెంకటేశ్వర్లు, దప్పుశివ, గుంటి గురవయ్య, పోలూరి రాము, నారాటి చంద్రమోహన్, గాదరి వెంకట్ తదితర కళాకారులు పాల్గొన్నారు.

# "అల్ఫోర్స్" అధినేత నరేందర్ రెడ్డికి అభినందన




కరీంనగర్, సెప్టెంబర్ 20: (నేటినిజం ప్రతినిధి) విద్యార్థులకు నాణ్యతమైన విద్యనందించడ్ చాలా ముఖ్యమైనదని, ఖ్యాతి గడించవచ్చని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా॥ వి.నరేందర్ రెడ్డి అన్నారు. స్థానిక అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్లో వారికి ప్రతిష్టాత్మక యూనివర్సల్ ఐకాన్ ఆచీవర్ అవార్డ్ 2024 రావడం పట్ల ఏర్పాటు చేసిన ప్రత్యేక అభినందన సభకు ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వారుమాట్లాడుతూ గత 34 ఏళ్లుగా అల్ఫోర్స్ తెలంగాణ విద్యరంగంలో అనేక పెనుమార్పులు తీసుకరావడమే కాకుండా ఎంతో మంది విద్యార్థులను ప్రతిభవంతులుగా చేసింది అనడంలో ఎటువంటి సందేహం లేదని తెలిపారు. తల్లిదండ్రుల ఆశయాలను దృష్టిలో పెట్టుకొని విద్యనందిస్తూ అగ్రగామిగా నిలుస్తున్నామని హర్షం వ్యక్తం చేశారు. చక్కటి ప్రణాళికలతో విద్యనందిస్తున్నందుకు యూఏఇ చెందిన జెనటిక్స్ అల్టిమా వారు, అల్ఫోర్స్ అవలంబిస్తున్న విద్య విధానాలకు వారు యూనివర్సల్ ఐకాన్ ఆచీవర్ అవార్డ్ 2024ని ప్రకటించి ప్రతినిధి ద్వారా పంపించారని చెప్పారు. ఈ అవార్డు రావడానికి కృషి చేసిన పరిపాలన విభాగం వారికి, ప్రిన్సిపాల్ కు, ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు, తల్లిదండ్రులకు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. ఆవార్డు రావడం పట్ల విద్యసంస్థల యాజమాన్యాలు, విద్యార్థి సంఘాలు, యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

# మృతుల కుటుంబాలకు పరామర్శ



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 20 : (నేటినిజం ప్రతినిధి): వేములవాడ మున్సిపల్ పరిధిలోని ఇస్లాం నగర్ (నాంపెల్లి)లో అనారోగ్యంతో ఉన్న సయ్యద్ ఇమామ్ షేక్ ఇమామ్ కుటుంబాలను శుక్రవారం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబసభ్యులకు ఏనుగు మనోహర్ రెడ్డి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి వెంట డాక్టర్ వాసాల శ్రీనివాస్, అబ్దుల్ రెహమాన్, హైదర్, కలీం, శాదుల్ల, ముర్షద్, అక్బర్, రషీద్, కాలిబ్, సాజీర్, శాన్ మొహమ్మద్ అలీ తదితరులు ఉన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.
'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.